08-04-2024
సోమవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 291
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం



బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు: 140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.




## కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా

# నిరాహారదీక్ష

### బిజెపిది నియంతృత్వ ధోరణి అని 'ఆప్' నేతల విమర్శ

### పార్టీని నామరూపం లేకుండా చేసేందుకు కుట్ర పన్నిందని మండిపాటు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అగ్రనేతలు ఆదివారం జంతర్‌మంతర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేశారు. బిజెపి నియంతృత్వ ధోరణని అవలంబిస్తుందని విమర్శించారు. దేశ రాజధానిలో నిర్వహించిన నిరాహార దీక్షలో అనేకమంది పార్టీ వలంటీర్లు, మద్దతుదారులు పాల్గొన్నారు. దేశభక్తి గీతాలు ఆలపిస్తూ, కేజ్రీవాల్ జైలులో ఉన్నట్లు ముద్రించిన పోస్టర్లను ఎగురవేస్తూ దీక్ష చేశారు. భారత్‌లోని ఇతర రాష్ట్రాల్లోనే కాకుండా బోస్టన్‌లో హార్వర్డ్ స్క్వేర్ వద్ద, లాస్ ఏంజెల్స్‌లో, వాషింగ్టన్ డిసిలోని భారత రాయబార కార్యాలయం వెలుపల, టొరంటో, లండన్, మెల్‌బోర్న్‌లో భారతీయులు నిరాహార దీక్షలు చేపట్టినట్లు ఆప్ నేతలు వివరించారు. ఈ దీక్షలో ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయల్, డిప్యూటీ స్పీకర్ రాఖీ బిల్లా, మంత్రులు అతిశ్, గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, కైలాష్ గెహ్లోట్, ఇమ్రాన్ హుస్సేన్‌తో పాటు ఆ పార్టీ సీనియర్ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన నిరాహారదీక్షలో ఢిల్లీ మద్యం కేసులో ఇటీవల సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయగా జైలు నుంచి బయటకు వచ్చిన ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ మాట్లాడుతూ అరెస్టు అయిన కేజ్రీవాల్ నిజాయితీగా ఉన్నారని, ఆయన ఎప్పటికీ అలానే ఉంటారన్నారు. కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయడాన్ని ఆయన ప్రశ్నించారు, కేసును విచారిస్తున్న సిబిఐ, ఇడికి చెందిన 456 మంది సాక్షులలో కేవలం నలుగురు మాత్రమే ఆప్ జాతీయ కన్వీనర్ పేరు ప్రస్తావించారని పేర్కొన్నారు. ఏ పరిస్థితుల్లో ఈ సాక్షులు కేజ్రీవాల్ పేరు ప్రస్తావించారో ప్రజలకు బాగా తెలుసునన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు, ఇండియా కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని ఆప్ వలంటీర్లకు ఆయన పిలుపునిచ్చారు. బిజెపి నియంతృత్వ ధోరణిని

తరువాయి 2లో

# విద్యుత్ అక్రమాలపై వంద రోజుల్లో నివేదిక

### భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణాలు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంపై రాజకీయాలకు అతీతంగా విచారణ

### కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్

భద్రాద్రి, యాద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణాలు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం అంశంపై న్యాయ విచారణ ప్రారంభమైంది. రాజకీయాలకు అతీతంగా, అన్ని కోణాల్లో విచారించి, అందరి అభిప్రాయాలు, అనుమానాలపై అధ్యయనం చేసి వంద రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్టు కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి వెల్లడించారు. పవర్ ప్లాంట్, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంలో అవినీతి జరిగిందనే విమర్శల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి అధ్యక్షతన కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో పవర్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో జరిగిన అక్రమాలు, ఛత్తీస్‌గఢ్‌తో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు చేసుకున్న పిపిఎలపై విచారణ వేగాన్ని పెంచింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి ఎస్‌ఎఎం రిజ్వీ, ట్రాన్స్‌కో జెఎండి శ్రీనివాసరావు, తదితరుల అధికారులతో కమిషన్

తరువాయి 2లో

## కాంగ్రెస్‌లోకి భద్రాచలం ఎంఎల్‌ఎ



### సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న తెల్లం వెంకట్రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఏకైక ఎంఎల్‌ఎ తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెల్లం వెంకట్రావుకు రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువను కప్పి కాంగ్రెస్‌లోనికి ఆహ్వానించారు. భద్రాచలం బిఆర్‌ఎస్

తరువాయి 2లో



## లోక్‌సభ ఎన్నికల్లో నిరుద్యోగమే అతిపెద్ద అంశం

### ఉద్యోగ శోధనలో నానా ఇబ్బందులు పడుతున్న యువత : ఖర్గే

**న్యూఢిల్లీ:** బిజెపి విధించిన నిరుద్యోగమే లోక్‌సభ ఎన్నికల్లో అతిపెద్ద అంశమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఉద్యోగ శోధనలో యువత నానా ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. కాంగ్రెస్ 'యువ న్యాయ్' గ్యారంటీ కంద 'పెహ్లీ నౌక్రీ పక్కి' యువతకు ఉన్న అడ్డంకులను తొలగించి వారి కెరీర్ వృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తుందని ఖర్గే 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థలు, ఐఐటిలు, ఐఐఎంలను ఖర్గే ప్రస్తావిస్తూ... 12 ఐఐటిల్లో దాదాపు 30 శాతం మంది విద్యార్థులు రెగ్యులర్ ప్లేస్‌మెంట్‌లు పొందడం లేదన్నారు. ఇప్పటి వరకు 21 ఐఐఎంలలో కేవలం 20 శాతం మాత్రమే సమ్మర్ ప్లేస్‌మెంట్‌లను పూర్తి చేయగలిగాయన్నారు. ఐఐటిలు, ఐఐఎంల పరిస్థితే ఇలా ఉంటే, దేశవ్యాప్తంగా మన యువత భవిష్యత్తును బిజెపి ఎలా నాశనం చేసిందో ఊహించుకోవచ్చని ఖర్గే చెప్పారు. మోడీ ప్రభుత్వ హయాంలో యువత నిరుద్యోగం రేటు 2014 కంటే మూడు రెట్లు పెరిగిందని ఆయన

తరువాయి 2లో



### ఇండియా కూటమి అధికారంలోకి వస్తే

## పుదుచ్చేరికి రాష్ట్ర హోదా

### తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్

**పుదుచ్చేరి:** విపక్ష 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇస్తామని డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అన్నారు. కూటమి తరఫున లోక్‌సభ బరిలో ఉన్న కాంగ్రెస్ సిటింగ్ ఎంపి వై.వైతిలింగంకు మద్దతుగా నిర్వహించిన ప్రచార ర్యాలీలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. పుదుచ్చేరికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇచ్చేందుకు కాంగ్రెస్, డిఎంకె కట్టుబడి ఉన్నాయని తెలిపారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి కేంద్ర ప్రభుత్వ చేతిలో

తరువాయి 2లో



## 14 స్థానాలే లక్ష్యం

### లోక్‌సభ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ శ్రేణులకు సిఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశనం

### సికింద్రాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ముఖ్యనేతలతో భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్



లోక్‌సభ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలపైన నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు టిపిసిసి అధ్యక్షుడు,ముఖ్యమంత్రిఎ.రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారు. గెలుపు వ్యూహాలపై ఎంపి అభ్యర్థులు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో సికింద్రాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య నేతలతో రేవంత్‌రెడ్డి ఆదివారం వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులు, స్థానికంగా ప్రభావితం చేసే అంశాలపై చర్చించినట్టు తెలిసింది. తొలుత వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం. నరేందర్ రెడ్డి, ఎంఎల్‌ఎలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, నాగరాజు, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య, అలాగే సికింద్రాబాద్ లోక్‌సభ సమావేశంలో ఎంపి అభ్యర్థి దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి , కాంగ్రెస్

తరువాయి 2లో

# ఏదీ ఎన్నికల సందడి?

### మణిపూర్‌లో కనిపించని పోస్టర్లు, హోర్డింగ్‌లు

### ఎన్నికల సంఘానికి సవాల్‌గా మారిన ఓటింగ్

### 24 వేలమంది నిర్వాసితులకు సహాయక శిబిరాల నుంచే ఓటు వేసే అవకాశం






**ఇంఫాల్ :** గత ఏడాదంతా మణిపూర్ అల్లర్లతో అట్టుడికింది. మైత్రేయ్, కుకీ తెగల మధ్య పోరుతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఘర్షణల్లో 219 మంది చనిపోయారు. 50,000 మందికి పైగా ప్రజలు నిర్వాసితులయ్యారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. అయితే ఎన్నికల సందర్భంగా కనిపించే సంప్రదాయ ప్రచారం మణిపూర్‌లో ఎక్కడా కనిపించడం లేదు. కనీసం పోస్టర్లు, హోర్డింగులు కూడా కనిపించడం లేదు. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికలను నిర్వహించడం సవాలుతో కూడిన పనికి ఎన్నికల సంఘం సిద్ధమైంది. 24,500 మంది నిర్వాసితులను రాబోయే ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులుగా గుర్తించామని, సహాయ శిబిరాల నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ప్రధాన ఎన్నికల అధికారి ప్రదీప్ కుమార్ ఝా తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రంలో మొత్తం 2,955 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నాం. వీటిలో దాదాపు 50 శాతం సున్నితమైనవి, బలహీనమైనవి లేదా క్లిష్టమైనవిగా గుర్తించాం. ఓటింగ్‌ను సులభతరం చేయడానికి అంతర్గతంగా స్థానచలనం చెందిన వారి కోసం 94 ప్రత్యేక పోలింగ్ స్టేషన్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నాం' అని ఝా పిటిఐకి చెప్పారు. ఓటర్లను సానుభూతితో వ్యవహరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఓటరు అవగాహన కార్యక్రమాలను కూడా ప్రారంభించామన్నారు. తమ ఇంటిలో ఉండే సౌలభ్యాన్ని కోల్పోయిన నిర్వాసితుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని కార్యకలాపాలు రూపొందిస్తున్నట్లు ఝా చెప్పారు. మణిపూర్‌లో ఈనెల 19, 26 తేదీల్లో రెండు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. అయితే నిర్వాసితుల ఓటింగ్ ఏర్పాట్లపై అందరూ ప్రత్యేక దృష్టి సారించారు. అనేక ప్రజా సంఘాలు, బాధిత ప్రజలు కలహాలతో దెబ్బతిన్న రాష్ట్రంలో ఎన్నికల ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలను కూడా బహిష్కరించాలని పలు వర్గాల నుంచి పిలుపులు వస్తున్నాయి. కాగా, రాష్ట్రంలో 20 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని ఝా చెప్పారు. 'రాష్ట్రం సాంప్రదాయకంగా గత ఎన్నికలలో చాలా ఎక్కువ ఓటింగ్ శాతాన్ని చూస్తోంది. ఇది ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. కొంతమంది దాని గురించి ప్రతికూలంగా భావించినప్పటికీ, మేము ప్రతి ఓటును లెక్కించేలా అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నాము. కొన్ని విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు తీసుకుంటున్నాము' అని తెలిపారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్ల గురించి అడిగిన ప్రశ్నకు ఝా స్పందిస్తూ రాష్ట్రానికి 200 కంపెనీలకు పైగా పారామిలటరీ బలగాలను కేటాయించినట్లు చెప్పారు. స్థానభ్రంశం చెందిన ఓటర్లు అవకాశాన్ని కోల్పోకుండా చూసుకోవడమే కాకుండా వారు సురక్షితంగా ఉన్నారని భావించేందుకు భద్రతను పెద్ద ఎత్తున మోహరించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని,

తరువాయి 2లో

### హేమంత్ సోరెన్ కేసులో సాక్ష్యాలుగా

## రిఫ్రిజిరేటర్, స్మార్ట్ టివి బిల్లులు



**న్యూఢిల్లీ:** సుమారు 31 కోట్ల రూపాయలకుపైగా విలువ చేసే 8.86 ఎకరాల భూమిని అక్రమంగా సంపాదించారంటూ జార్ఖండ్ ముక్తిమోర్చా నాయకుడు, జార్ఖండ్ మాజీ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై ఆరోపణలు చేసి, ఆయనను అరెస్టు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, తన వాదనకు సాక్ష్యాలుగా ఒక రిఫ్రిజిరేటర్, మరో స్మార్ట్ టివి బిల్లులను కోర్టుకు సమర్పించింది. రాంచీకి చెందిన ఇద్దరు డీలర్ల నుంచి ఇడి ఈ రసీదులను సంపాదించినట్టు సోరెన్, మరో నలుగురిపై దాఖలు చేసిన కేసులో చార్జిషీట్‌లో ఇడి పేర్కొంది. ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన కొద్ది సేపటికే 42 ఏళ్ల సోరెన్‌ను భూకబ్జా, మనీ లాండరింగ్ కేసులో జనవరి 31న ఇడి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన రాంచీలోని హోత్వార్‌లో ఉన్న బిర్సా ముండా జైలులో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. ఇడి చార్జిషీట్ ప్రకారం

తరువాయి 8లో

### రాష్ట్రంలో ఐదు రోజులు

## ఈదురుగాలులతో వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న ఐదు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తణనీయంగా తగ్గుతాయని అధికారులు తెలిపారు. అయితే గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 41 నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు రాష్ట్రానికి తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పుల హెచ్చరికలను హైదరాబాద్ వాతావరణ శాఖ జారీ చేసిన విషయం తెల్సిందే. తీవ్రమైన ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు కాస్త ఉపశమనం లభించనుంది. పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశారు. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల,

తరువాయి 2లో

# బతకనివ్వరా?

### పెరుగుతున్న భ్రూణ హత్యలు

### మహిళల పట్ల వీడని వివక్ష

### కాసుల కోసం కక్కుర్తి పడుతున్న ఆసుపత్రులు



ప్రజాపక్షం/ ఖమ్మం

సమాజం అధునీకత వైపు పరుగులు పెడుతుంది. నవీన యుగంలో సైన్స్ అద్భుతమైన పురోగతి సాధించింది. అలాంటి సైన్స్‌ను అమానుష కార్యక్రమాలకు, చట్ట విరుద్ధ చర్యలకు మళ్లిస్తున్నారు. కడుపులో ఉన్న శిశువు ఆడో, మగో తెలుసుకుని ఆడపిల్ల అయితే కడుపులోనే చంపేస్తున్నారు. అమాయకులు సమాజం పట్ల అవగాహన లేని వారు భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారనుకుంటే పొరపాటే. మహిళలు సాధించిన అద్భుత విజయాలను బాలుర కంటే బాలికలు సాధిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కళ్లారా చూస్తున్న వారు కూడా ఈ ఘాతుకానికి పాల్పడుతున్నారంటే

తరువాయి 2లో



## ఓరెన్‌బర్గ్‌లో ఫెడరల్ ఎమర్జెన్సీ

**మాస్కో:** వరదలతో అల్లాడుతున్న ఓరెన్‌బర్గ్ ప్రాంతంలో, బాధిత ప్రాంతాలను ఫెడరల్ ఎమర్జెన్సీగా రష్యా ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. ఉరల్ నదిలో నీటి మట్టాలు పెరగడం వల్ల వరదలు సంభవించాయి. చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. కనీసం, 885 మంది పిల్లలతో సహా సుమారు 4,000 మందిని ఆయా ప్రాంతాల నుంచి అధికారులు ఖాళీ చేయించారు. మరో 2000 ఇళ్లు ఇప్పటికే జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. ఆ ప్రాంతాలతో కలిపి, వరద బాధితుల సంఖ్య 6,300కి చేరుకుందని రష్యా జాతీయ వార్తా సంస్థ టాస్ తెలిపింది. రష్యా అత్యవసర పరిస్థితుల మంత్రి అలెగ్జాండర్ కురెన్కోవ్ సహాయక కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఆదివారం ఆర్క్స్‌కు చేరుకున్నారు. వరదల వల్ల ఈ నగరం ఎక్కువగా దెబ్బతిన్నది. ఫెడరల్ ఎమర్జెన్సీని ప్రకటించిన తర్వాత, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ, సహాయక కార్యక్రమాలను కొనసాగించేందుకు వీలుగా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు కురెన్కోవ్ ప్రకటించారు. ఆర్క్స్, కజకస్థాన్ సరిహద్దుకు ఉత్తరాన సుమారు 20 కిలోమీటర్ల (12.4 మైళ్ళు) దూరాన సంభవించిన వరదల కారణంగా ఆనకట్ట తెగిపోయిందని ఆర్క్స్ మేయర్ వాసిలీ కోజుపిట్సా తెలిపారు. ఆదివారం ఉదయం నాటికి నగరంలోని సుమారు రెండు లక్షల ఇల్లలో 4,500 ఇళ్లు వరద నీటిలో చిక్కుకున్నాయని చెప్పారు. డ్యామ్ విచ్ఛిన్నం కావడానికిగల కారణాలను తెలుసుకునేందుకు క్రిమినల్ విచారణ ప్రారంభమైందని ప్రకటించారు. కాగా, ఆ డ్యామ్ 5.5 మీటర్ల (దాదాపు 18 అడుగులు) వరకు నీటి మట్టాలను తట్టుకోగలదని స్థానిక అధికారులు తెలిపారు. శనివారం ఉదయం, నీటి మట్టం సుమారు 9.3 మీటర్లు (30.51 అడుగులు) చేరుకోవడంతో, ఆనకట్ట తెగిపోయిందని వివరించారు.

## అది భద్రత లేని వాహనం..

**పెషావర్:** వాయువ్య పాకిస్తాన్‌లో గత నెలలో జరిగిన ఆత్మాహుతి దాడికి గురైన వాహనంలో ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేవని, ఈ ఘటనపై దర్యాప్తు నిర్వహించిన కమిటీ నివేదిక స్పష్టం చేసింది. మార్చి 26న, ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా ప్రావీనమ్స్‌లోని మారుమూల బేషమ్ ప్రాంతంలోని కోహిస్తాన్ జిల్లా దాసు జలవిద్యుత్ కేంద్ర నిర్మాణ పనులకు సిబ్బందిని తీసుకెళుతున్న వాహనంపై ఆత్మాహుతి దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఐదుగురు చైనా ఇంజనీర్లతోపాటు, ఆ వాహనాన్ని నడిపిస్తున్న పాకిస్తాన్‌కు చెందిన డ్రైవర్ కూడా మృతి చెందాడు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన చైనా, దర్యాప్తు కోసం ప్రత్యేకంగా ఒక బృందాన్ని బీజింగ్ నుంచి పంపింది. మరోవైపు ఘటనపై పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ విచారణకు ఆదేశించారు. ఆ విచారణ నివేదికను అనుసరించి, దాడికి గురైన వాహనం బాంబు లేదా బులెట్ ప్రూఫ్ కాదు. సిబ్బందిని తీసుకెళుతున్న మొదటి బస్సుకు సుమారు 15 అడుగుల దూరంలో రెండో బస్సు ప్రయాణిస్తున్నది. ఆత్మాహుతి దాడి జరగడంతో, రెండో బస్సు సుమారు 300 అడుగుల లోతైన గుంతలో పడింది. పాకిస్తాన్‌లో పని చేస్తున్న తమ సిబ్బందికి తప్పనిసరిగా బులెట్ ప్రూఫ్ లేదా బాంబ్ ప్రూఫ్ వాహనాలను అందుబాటులో ఉంచాలని చైనా స్పష్టం చేసినప్పటికీ, పాకిస్తాన్ అధికారులు నిర్లక్ష్యం చేసినట్టు తాజా ఘటన స్పష్టం చేస్తున్నది.

# చిచ్చుపెట్టిన అరెస్టు..





**క్విటో:** ఓ అరెస్టు ఈక్వెడార్, మెక్సికో మధ్య చిచ్చుపెట్టింది. ఈక్వెడార్ మాజీ ఉపాధ్యక్షుడు జార్జి గ్లస్‌ను క్విటోలోని మెక్సికన్ రాయబార కార్యాలంలోకి చొరబడి మరీ అరెస్టు చేయడం ఈ సమస్యకు కారణమైంది. వివరాల్లోకి వెళితే, గ్లస్‌పై పలువ అవినీతి ఆరోపణలు ఉన్నాయి. 2016లో వందలాది మంది ప్రాణాలు హరించిన భూకంపం తర్వాత, పునర్నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టినప్పుడు గ్లస్ ముడుపులు తీసుకున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. లంచం, అవినీతి తదితర ఆరోపణలపై ఈక్వెడార్ ప్రభుత్వం దర్యాప్తు జరుపుతుండగా, గ్లస్ క్విటోలోని మెక్సికో కార్యాలయానికి వెళ్లి తలదాచుకున్నారు. మెక్సికో ప్రభుత్వం అతనికి ఆశ్రయం ఇస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే ఈక్వెడార్ బలగాలు మెక్సికన్ రాయబార కార్యాలయ తలుపు బద్దలు కొట్టి, లోపలికి చొచ్చుకువెళ్లాయి. గ్లస్‌ను అరెస్టు చేసి, గువయాక్విల్ నగరానికి తరలించాయి. ఈ ఘటనపై మెక్సికో తీవ్రంగా స్పందిచింది. తమ రాయబార కార్యాలయంలోకి భద్రతా దళాలు రావడాన్ని ఖండించింది. ఈక్వెడార్‌తో అన్ని రకాల దౌత్య సంబంధాలను రద్దు చేసుకుంటున్నట్టు మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రాడోర్ ప్రకటించారు. గ్లస్‌ను అరెస్టు చేయడాన్ని హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో సవాలు చేస్తున్నట్టు మెక్సికో ప్రభుత్వ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఇలావుంటే, గ్లస్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ఆయన తరఫు న్యాయవాది సోనియా వెరా వ్యాఖ్యానించారు. తన క్లయింట్ ప్రాణాలకు ప్ర మాదం ఉందని, ఆమె అనుమానం వ్యక్తం చేశారు. గ్లస్‌ను శారీరకంగా హింసించి, నేలపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లారని, ఇది అత్యంత క్రూరమని పేర్కొన్నారు. అరెస్టుపై న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు. ఏ దిఏమైనప్పటికీ, గ్లస్ అరెస్టు మెక్సికో, ఈక్వెడార్ దేశాల మధ్య చిచ్చుపెట్టిందనడంలో ఎలాంటి అనుమానం లేదు. మెక్సికన్ రాయబార కార్యాలయంలోకి భద్రతా దళాలు బలవంతంగా చొరబడాన్ని వివిధ దేశాలు ఖండించాయి. అంతర్జాతీయ నిబంధనలను, బాధ్యతలను ఈక్వెడార్ గుర్తించకపోవడం దారుణమని స్పానిష్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. క్విటోలోని మెక్సికో రాయబార కార్యాలయంలోకి బలవంతంగా ప్రవేశించడం దౌత్య సంబంధాలపై 1961 వియన్నా కన్వెన్షన్‌ను ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. దౌత్య కార్యకలాపాల నిబంధనలను ఈక్వెడార్ ఉల్లంఘించిందని అమెరికా ఒక ప్రకటనలో పేర్కొంది. హోండురాస్ అధ్యక్షుడు జియోమారా కాస్ట్రో తన 'ఎక్స్' పోస్టులో గ్లస్‌ను అరెస్టు చేసిన విధానాన్ని తప్పుపట్టారు. దీనిని అంతర్జాతీయ సమాజం సహించలేదన్నారు.

ప్రపంచం

## హౌతీ క్షిపణి అడ్డగింత

బెర్లిన్: హౌతీ ప్రయోగించిన క్షిపణిని దక్షిణ ఎర్ర సముద్రంలో సమర్థంగా అడ్డుకున్నట్టు యూరోపియన్ యూనియన్ (ఇయు) ప్రకటించింది. హౌతీ ఉగ్రవాదులు ఎర్ర సముద్రంలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై తరచు దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులు, దారుణ మారణకాండను ప్రతీకారంగానే తాము కూడా దాడులు చేస్తున్నట్టు హౌతీ ప్రకటించింది. మరోవైపు హౌతీని కట్టడి చేసేందుకు 'ఆస్ప్రైడ్స్' పేరుతో ఇయు ఒక మిషన్‌ను ప్రారంభించింది. ఇలావుంటే, తమ నావికాదళ వ్యాపార నౌకలను రక్షించడానికి, హౌతీ నియంత్రిత భూభాగం నుంచి దూసుకొచ్చిన క్షిపణిని అడ్డగించినట్టు ఇయు ఒక ప్రకటనలో తెలిపింది. జర్మన్ యుద్ధనౌక 'హెస్సెస్' ఈ అత్యంత వేగంగా స్పందించడం వల్లే క్షిపణి ప్రమాదం తప్పిందని పేర్కొంది.



## స్లోవేకియా అధ్యక్షుడిగా పెల్లెగ్రిని



**బ్రాటిస్లావా:** పాశ్చాత్య దేశాల అనుకూల వర్గాలకు స్లోవేకియాలో ఎదురుదెబ్బలు తప్పడం లేదు. జనాదరణ పొందిన రాబర్ట్ ఫికో ప్రధానిగా ఉండగా, ఇప్పుడు అధ్యక్ష ఎన్నికల్లో ఆయన మద్దతుదారుడు, పార్లమెంటరీ స్పీకర్ పీటర్ పెల్లెగ్రినా విజయభేరి మోగించారు. దీనితో పాశ్చాత్య అనుకూల శక్తులకు మరోసారి చేదు అనుభవం ఎదురైంది. దేశ మొట్టమొదటి మహిళా దేశాధిపతి జుజానా కాపుటోవా నుంచి పెల్లెగ్రిని దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తారు. పోలింగ్‌లో పెల్లెగ్రిని 53.85 శాతం ఓట్లు సంపాదించగా, ఆయన ప్రధాన ప్రత్యర్థి, మాజీ విదేశాంగ మంత్రి ఇవాన్ కోర్కోక్‌కు 46.14 శాతం ఓట్లు లభించాయి. తాను ఓటమిని అంగీకరిస్తున్నానని, ఈ ఫలితాలు నిరాశ కలిగించినప్పటికీ, ఓటర్ల నిర్ణయాన్ని గౌరవిస్తున్నానని కోర్కోక్ వ్యాఖ్యానించారు. కాగా, 1993లో చెకోస్లోవేకియా విడిపోయిన, స్లోవేకియాగా స్వాతంత్ర్యం పొందినప్పటి తర్వాత , పెల్లెగ్రిని ఆ దేశ ఆరవ అధ్యక్షుడు. ఉక్రేన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన కావుటోవా తీవ్ర విమర్శలకు గురయ్యారు. దీనితో ఆమె మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయలేదు. దీనితో మాజీ విదేశాంగ మంత్రి కోర్కోక్ రంగంలోకి దిగారు. కానీ, ఓటమిని ఎదుర్కోక తప్పలేదు. తాజా ఎన్నికల్లో పెల్లెగ్రిని విజయం ఫికో అధికారాన్ని సుస్థిరం చేసింది. 5.4 మిలియన్ల జనాభా ఉన్న స్లోవేకియా అధ్యక్షుడు, అక్కడి పార్లమెంటరీ ఎన్నికల తర్వాత ప్రధానమంత్రి నియామకం జరుగుతుంది. కొత్త ప్రభుత్వంలో ప్రమాణం చేసి రాజ్యాంగ న్యాయస్థానం న్యాయమూర్తులను నియమిస్తారు. స్లోవేకియా రాజ్యాంగాన్ని అనుసరించి, అక్కడి ప్రెసిడెంట్ కూడా చట్టాలను వీటో చేయగలరు. అయితే, పార్లమెంటు సాధారణ మెజారిటీతో ఆ వీటోను అధిగమించవచ్చు. అవసరమైతే అధ్యక్షుడి వీటో నిర్ణయాన్ని రాజ్యాంగ న్యాయస్థానంలో సవాలు చేయవచ్చు. దోషులను క్షమించే హక్కు దేశాధినేతకు కూడా ఉంది. కాగా, ప్రధానమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వం చాలా కార్యనిర్వాహక అధికారాలను కలిగి ఉంది. గత ఏడాది సెప్టెంబర్ 30న జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో ఫికో నేతృత్వం వహిస్తున్న లెఫ్టిస్ట్ స్మెర్ పార్టీ ఘన విజయం సాధించింది. అల్ట్రానేషనలిస్ట్ స్లోవాక్ నేషనల్ పార్టీతో కలిసి పాలక కూటమిలో చేరింది.

## అతిపెద్ద అంశం (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఇటీవల ఐఎల్ఓ వెల్లడించిన భారతదేశ ఉపాధి నివేదిక ప్రకారం... ప్రతి సంవత్సరం, భారతదేశం దాదాపు 70–80 లక్షల మంది యువతను శ్రామిక శక్తిలో చేర్చుకుంటుంది, అయితే ఆ వృద్ధి 2012–2019 మధ్య, శూన్యంగా ఉందని, కేవలం 0.01 మాత్రమే మాత్రమేనని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించే మోడీకి గ్యారెంటీ మన యువత హృదయాల్లో, మనస్సులలో ఒక చెడ్డ కలగా ప్రతిధ్వనిస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ 'పెహ్లీ నౌక్రీ పక్కి' హామీని తీసుకొచ్చిందని తెలిపారు. 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఏదైనా డిప్లొమా లేదా డిగ్రీ హోల్డర్ ఇప్పుడు ఉద్యోగాన్ని డిమాండ్ చేసే చట్టపరమైన హక్కును కలిగి ఉంటారని, సంవత్సరానికి కనీసం రూ. 1 లక్ష చెల్లించాలని ఖర్గే చెప్పారు. కాగా, శుక్రవారం కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమక్షంలో విడుదల చేయగా, ఐదు 'న్యాయ స్తంభాలు' వాటి కింద పేర్కొన్న 25 హామీలపై దృష్టి సారించింది. అప్రెంటిస్‌షిప్ హక్కు, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)పై చట్టపరమైన హామీ, షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని పెంచడానికి రాజ్యాంగ సవరణ, దేశవ్యాప్త కుల గణన, స్వల్ప కాలిక సైనిక నియామకాల కోసం అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయడం వంటివి కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలలో ఒకటిగా ఉన్నాయి.

## ఏదీ ఎన్నికల సందడి?
(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే వీడియో నిఘా ప్రారంభమైందని, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను పర్యవేక్షిసుస్తున్నారని, రాష్ట్రంలో నెలకొన్న సంఘర్షణను దృష్టిలో ఉంచుకుని భద్రతకు సంబంధించిన ఆందోళనలు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది, అయితే, ఈ ఆందోళనలు పరిష్కరించబడుతున్నాయి' అని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, రెండు వారాల్లోపు లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ జరగనున్న హింసాత్మక మణిపూర్‌లో రాజకీయ పార్టీల పోస్టర్లు, మెగా ర్యాలీలు, నాయకుల కదలికలు ప్రచారంలో సంప్రదాయ అంశాలు స్పష్టంగా కనిపించడం లేదు. స్థానిక ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవలసిందిగా కోరడం మాత్రమే రాబోయే ఎన్నికలకు సంబంధించిన ఏకైక సూచనగా కనిపిస్తుంది. రాష్ట్రంలో ప్రచారం తక్కువగా ఉందని, అయితే ఇసి నుండి ఎటువంటి ఆంక్షలు లేవని ఝా అంగీకరించారు.

## వందరోజుల్లో నివేదిక (మొదటి పేజీ తరువాయి)

చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు. సుదీర్ఘంగా జరిగిన ఈ సమీక్షలో ఒప్పందాలు, పవర్‌ప్లాంట్‌కు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించినట్టు తెలిసింది. ముఖ్యంగా పిపిఎల నిర్ణయాలు తీసుకున్న సమయంలో ఉన్న అధికారులు, అప్పటి పరిస్థితులు, పలు ఆరోపణలపై కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. సమావేశం అనంతరం నరసింహారెడ్డి మీడియాతో మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం చేసుకున్న సమయంలో ఉన్న అధికారుల అభిప్రాయాలను తెలుసుకుంటామని తెలిపారు. ఒప్పంద సమయంలో నిర్ణయాలు తీసుకున్న అప్పటి కొందరు అధికారుల అభిప్రాయాలతో పాటు అనుమానాలు వ్యక్తం చేస్తున్న పలువురి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్టు తెలిపారు. ఆ సమయంలో ఉన్న అధికారులకు లేఖలు రాస్తామన్నారు. ఈ అంశంలో ప్రజాభిప్రాయా సేకరణ కూడా ఉంటుందని, సమాచారం నిమిత్తం అవసరమనుకున్న వారికి నోటీసులు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. పిపిఎలపై లోతుగా అధ్యయనం చేస్తామని, అలాగే పలువురు తమ అభిప్రాయాలను, అనుమాలను వ్యక్తం చేయవచ్చునని, దీనికి సంబంధించి మెయిల్ ద్వారా కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చని నరసింహారెడ్డి తెలిపారు. కమిషన్ విచారణలో ఎటువంటి దూషణలు లేకుండా, రాజకీయాలకు అవకాశం ఇవ్వబోమని, న్యాయ, చట్టబద్ధంగా విచారణ జరుగుతోందని ఆయన స్పష్టం చేశారు.

# బతకనివ్వరా ?

(మొదటి పేజీ తరువాయి)

ఇంత కంటే అమానుషం మరొకటి లేదు. ఇంకా మగ పిల్లవాడైతే తలకొరివి పెడతాడు, ఇంటి పేరు నిలబడుతుంది, పున్నామ నరకం నుంచి తప్పిస్తాడన్న చాందాస భావాలు కొందరిని వీడడం లేదు. భ్రూణ హత్యల నివారణకు సంబంధించి రెండు విషయాలపై ప్రధానంగా దృష్టి సారించాలి. మొదటిది ఆడపిల్ల పుట్టిన ఫర్వాలేదని సమాజంలో మహిళలు సాధించిన విజయాలను తెలిపి ప్రస్తుత పరిస్థితులను వివరించి అవగాహన కల్పించడం, రెండవది లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడపిల్ల అయితే కడుపులోనే హతమార్చే చర్యలకు పాల్పడుతున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవడం. ప్రసార మాధ్యమాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడం, సోషల్ మీడియా విస్తరించిన వేళ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో మహిళలు సాధించిన విజయాలు ఇంటింటికి చేరుతున్నాయి. పురుషులకు ఏ మాత్రం తీసిపోనివిధంగా మహిళలు ముందు వరుసలో ఉంటున్నారు. విద్యార్జనలోను, ఉద్యోగ సాధనలోను చాలా సందర్భాల్లో విద్యార్థినిలదే ఒక్కింత పైచేయిగా కనిపిస్తుంది. కేవలం ఉద్యోగ సాధనే కాకుండా స్వయం ఉపాధిలోను మహిళలు ముందుంటున్నారు. మునుపెన్నడు లేనివిధంగా చిరు వ్యాపారాల నిర్వహణ, ఉపాధి వనరుల చోదనలోను ముందుంటున్నారు. ఆడపిల్లలు కుటుంబానికి భారంగా కాకుండా భరోసా ఇస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆడపిల్లను గర్బంలోనే అంతం చేయడం ఎందుకన్న ప్రశ్న విస్తృత చర్చకు దారి తీయాలి. ఇక రెండవది ఆసుపత్రులు కాసుపత్రులుగా మారి ధనార్జనే ధ్యేయంగా చట్టవిరుద్ధ పనులకు పాల్పడుతున్నారు. ఖమ్మంలో ఒక ఆసుపత్రి నెల రోజుల కాలంలోనే 40 అబార్షన్లు చేసిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. ఈ ఆసుపత్రులకు సంబంధించి అనుమతులను రద్దు చేయడమనేది కేవలం పాక్షిక చర్య మాత్రమే. ఒక ఆసుపత్రి నిర్వహిస్తున్న వారు రిజిస్ట్రేషన్ రద్దు కాగానే మరో ఆసుపత్రిని తెరుస్తున్నారు. గతంలో అనుమతి పొంది నిర్వహణలో లేని ఆసుపత్రులను తిరిగి తీసుకోవడం లేదా మరో వైద్యుని పేరుతో ఆసుపత్రిని రిజిస్ట్రేషన్ చేయడం చేస్తున్నారు. ఖమ్మంలో వైద్యాధికారులు ఆసుపత్రిని సీజ్ చేసిన తర్వాత అదే యాజమాన్యం ఇప్పటికీ వివిధ రకాల పేర్లతో నాలుగు ఆసుపత్రులను ఏర్పాటు చేసింది. ఎవరు అధికారంలో ఉంటే వారికి నిలువెత్తు ఫ్లెక్సీలు పెట్టి రాజకీయ అండతో రెచ్చిపోతున్నారు. కేవలం రిజిస్ట్రేషన్లను రద్దు చేయడమే గాక పదే పదే తప్పిదాలకు పాల్పడుతున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంది. ఆసుపత్రుల అనుమతులకు సంబంధించి కేవలం కాగితాలపై ఆధారపడి రిజిస్ట్రేషన్లు చేయకుండా పరిశీలన, అనుమతుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని మరో అడుగు ముందుకేసి భ్రూణ హత్యలకు పాల్పడుతున్న వైద్యుల పట్టాలను రద్దు చేసి కఠినంగా శిక్షిస్తే తప్ప భ్రూణ హత్యలు నిలుపుదల చేయడం సాధ్యం కాదు. ఇదే రీతి కొనసాగితే ఆడ, మగ మధ్య సమతుల్యత దెబ్బతింటుంది. ఇప్పటికే హెచ్చు తగ్గులు సమాజంలో ఇబ్బందికర పరిణామాలకు దారి తీస్తున్నాయి. భ్రూణ హత్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా సమాజం పట్ల అవగాహన పెంపొందించే రీతిలో సామాజిక కార్యక్రమంగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నిరాహారదీక్ష
(మొదటి పేజీ తరువాయి)

అవలంబిస్తుందని ఢిల్లీ మంత్రి అతిషి ఆరోపించారు, ఆప్ చేపట్టిన నిరాహార దీక్ష కాషాయ పార్టీకి 'నిద్రలేని రాత్రులు' మిగులుస్తుందని పేర్కొన్నారు. కేజ్రీవాల్ అరెస్టుతో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇది బిజెపికి 'శవపేటికలో ఆఖరి గోరు' అని రుజువు చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌లో ముఖ్యమంత్రి భగవంత్ మాన్, పలువురు మంత్రులు స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ గ్రామం ఖట్కర్ కలాన్ వద్ద సామూహిక నిరాహార దీక్షలో పాల్గొన్నారని పార్టీ నాయకులు తెలిపారు. కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా నిరాహారదీక్షలో పాల్గొనాలని ఆప్ ఢిల్లీ విభాగం కన్వీనర్ గోపాల్ రాయ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ మద్యం కేసులో ఇడి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ఆప్‌ను అంతం చేయాలనే బిజెపి కుట్రలో భాగమని ఆయన ఆరోపించారు. కాగా, మార్చి 21న అరెస్టయిన కేజ్రీవాల్ ఏప్రిల్ 15 వరకు జ్యుడీషియల్ కస్టడీలో ఉండనున్నారు.

## 14 స్థానాలే లక్ష్యం
(మొదటి పేజీ తరువాయి)

నేతలు మహ్మద్ అజారుద్దీన్, ఫెరోజ్‌ఖాన్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో 14 ఎంపి స్థానాలను కైవలం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న సిఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు నాయకుల మధ్య సమన్వయం లోపం రాకుండాచూడడంతో పాటు కార్యకర్తలు, నాయకులకు బాధ్యతల కేటయింపు తదితర అంశాల సిఎం రేవంత్‌రెడ్డి చర్చించారు.

## పుదుచ్చేరికి రాష్ట్ర హోదా
(మొదటి పేజీ తరువాయి)

కీలుబొమ్మ అని స్టాలిన్ విమర్శించారు. తమిళనాడు వంటి పెద్ద రాష్ట్రాలే కాకుండా పుదుచ్చేరి లాంటి చిన్న కేంద్రపాలిత ప్రాంతాల హక్కులను సైతం రక్షించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బిజెపి పదేళ్ల పాలనలో పుదుచ్చేరికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు సహా బలహీన వర్గాల అభ్యున్నతికి ఏం చేశారో ప్రధానమంత్రి మోడీ ఎక్కడా చెప్పడం లేదన్నారు. కేవలం మతం, కులం ఆధారంగానే ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. శ్రీలంక నేవీ అరెస్టులతో కారైకాల్ మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్టాలిన్ అన్నారు. దీని పరిష్కారం కోసం మోడీ ఏం చేశారని ప్రశ్నించారు. పుదుచ్చేరిని అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీలను కేంద్ర విస్మరించిందన్నారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలు రోజురోజుకీ ఆందోళనకరంగా మారుతున్నాయన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన తొమ్మిదేళ్ల బాలిక హత్యాచారమే అందుకు నిదర్శనమన్నారు. పుదుచ్చేరిలోని ఏకైక లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది.

# ఈదురుగాలులతో వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం వనపర్తి, జోగులాంబ గద్వాలలో వడగాలులు వీస్తాయని, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్య, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశామన్నారు. మంగళవారం పలుచోట్ల తేలికపాటి జల్లులు కురుస్తాయన్నారు. బుధవారం హైదరాబాద్ నగరంతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు ములుగు, భూపాలపల్లి, మెదక్ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఉరుములు, మెరుపులతో వానలు కురుస్తాయన్న ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. అక్కడక్కడ ఉరుములు, మెరపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల ఈదురుగాలతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఎండ, ఉక్కపోతతో అవస్థలు పడుతున్న ప్రజలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వాతావరణంలో ఆహ్లాదకరమైన మార్పు ప్రజలకు కొంత ఊరట కలిగించనుంది.

### ఖమ్మం @ 45 డిగ్రీలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏప్రిల్ మాసం మొదటిలోనే ఎండలు అదరగొడుతున్నాయి. ఖమ్మంలో ఆదివారం 44, 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. భానుడి భగ భగలకు ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఎండవేడిమికి తోడు విపరీతమైన ఉక్కపోత ఇబ్బంది పెడుతుంది. వ్యవసాయ పనుల్లో ఉన్న కూలీలు, ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలుగుతుంది. పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెం, పాల్వం చ, మణుగూరు, ఇల్లందు, సత్తుపల్లి, అశ్వాపురం, సారపాకల్లో ఎండ వేడిమికి ప్రజలు తాళలేకపోతున్నారు. ఉష్ణోగ్రతలకు భూగర్భ జలాలు అడుగంటాయి. ఇప్పటి కే నీటి వనరుల్లో మచ్చుకు కూడా నీరు కనిపించడం లే దు. చెరువులు, కుంటలు ఎండిపోగా మధ్యతరహా ప్రాజెక్టులైనా వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులలో నీరు అడుగంటింది.

# కాంగ్రెస్‌లోకి భద్రాచలం ఎంఎల్‌ఎ

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్‌ఏగా గెలుపొందిన తెల్లం వెంకట్రావు కొంతకాలంగా సొంత పార్టీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. బిఆర్‌ఎస్ నిర్వహించిన పలు కార్యక్రమాలకు కూడా ఆయన దూరంగా ఉన్నారు. శాసనసభ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన కొద్ది రోజులకే ఆయన కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు విస్తృత ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెల్ల వెంకట్రావుతో పాటు ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన బిఆర్‌ఎస్ నేతల్లో రత్నం రమాకాంత్, బి.రాజీవ్, పి.శ్రీనివాస్, సిహెచ్ చిట్టిబాబు, ఎన్.రాము, కప్పుల నాగరాజు, ముప్పిడి రమేష్, జి.పవన్, సిహెచ్ సుధాకర్, జి.విజయ్, ఎం.భాను, వెంకట్, నాగేంద్రబాబు, రంగారావు, సాయిబాబు, శ్యామ్ రెడ్డి, రమేష్, హనుమంతరావు, సాయి, రాజేశ్వరి ఉన్నారు.

### తెల్లంకు అధికార ముద్ర

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికలు ముగిసిన నాటి నుండి భద్రాచలం శాసన సభ్యుడు తెల్లం వెంకట్రావు పార్టీ మార్పు పై గుసగుసలు వినిపిస్తూనే ఉన్నాయి. ఫలితాలు వచ్చిన మారు నాటి నుంచే అదిగో ఇదిగో అంటూ ఊహాగానాలు పరుగులు పెట్టాయి. ఎట్టకేలకు ఆ ఊహాగానాలను నిజం చేస్తూ తెల్లం వెంకట్రావు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తెల్లం వెంకట్రావు దుమ్ముగూడెంకు చెందిన వైద్యులు. భద్రాచలంలో ప్రముఖ వైద్యులుగా పేరొందారు. ఆయన రాజకీయ ప్రవేశం ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో జరిగింది. 2014లో పొంగులేటితో కలిసి వైఎస్‌ఆర్‌సిపిలో చేరారు. ఆ తర్వాత పొంగులేటి వైసిపిని విడిచి బిఆర్‌ఎస్‌లో చేరినప్పుడు పొంగులేటితో పాటే తెల్లం వెంకట్రావు సైతం బిఆర్‌ఎస్‌లో చేరారు. గతేడాది జూన్ రెండున పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బిఆర్‌ఎస్‌కు రాజీనామాకు చేసి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంలో పొంగులేటితో పాటు తెల్లం వెంకట్రావు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాడు. భద్రాచలం శాసన సభ్యునిగా 2018 ఎన్నికల్లో పొదెం వీరయ్య విజయం సాధించారు. కాంగ్రెస్ శాసన సభ్యుల్లో మూడొంతుల మంది పార్టీ మారినప్పటికీ పొదెం వీరయ్య పార్టీ మారకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగారు. 2023 శాసనసభ ఎన్నికల్లోను తిరిగి వీరయ్యకే టికెట్ లభిస్తుందన్న ప్రచార నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో ఉంటే తనకు ఎంఎల్ఏగా పోటీ చేసే అవకాశం రాదని భావించిన తెల్లం బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. తెల్లం రాజకీయ చరిత్ర, ఆయన వ్యవహార శైలి తెలిసిన బిఆర్‌ఎస్ అనేక ఏళ్ల నుంచి బిఆర్‌ఎస్‌లో పనిచేస్తున్న వారిని కాదని తెల్లం వెంకట్రావుకు టికెట్ ఇవ్వడమే పొరపాటు. ఆయన మొదటి నుంచి పొంగులేటి అనుచరునిగా ఉన్నారని తెలిసినా అవకాశం కల్పించారు. బిఆర్‌ఎస్‌లో ఉన్న వర్గాల కారణంగా తెల్లం వెంకట్రావును కొంత మంది అనూహ్యంగా బిఆర్‌ఎస్‌లో చేర్చి టికెట్ ఇప్పించారు. అందరు ఊహించినట్లుగానే ఆయన బిఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో బిఆర్‌ఎస్‌కు షాక్ కానీ కాంగ్రెస్‌కు కలిసొచ్చేది కానీ ఏమి లేదు. ఒక ఎంఎల్ఏను బిఆర్‌ఎస్ కోల్పోతే అదనపు బలం కాంగ్రెస్‌కు చేకూరింది అంతే.



## తమ్మారెడ్డి కృష్ణమూర్తి, తమ్మారెడ్డి కృష్ణవేణిలకు నివాళులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ సిని నిర్మాత, వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషి దివంగత తమ్మారెడ్డి కృష్ణమూర్తి సతీమణి తమ్మారెడ్డి కృష్ణ వేణి మూడవ వర్ధంతి సందర్భంగా సి.ఆర్. ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో తమ్మారెడ్డి కృష్ణమూర్తి, కృష్ణవేణిలకు ఘనంగా నివాళులర్పించారు. సి.ఆర్. ఫౌండేషన్ కోశాధికారి వి. చెన్నకేశవ రావు, వృద్ధాశ్రమ సలహా మండలి సభ్యులు డాక్టర్ పి. సరస్వతి, రాజేందర్ రావు, వృద్ధాశ్రమం వాసులు, తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రముఖ పాత్రికేయులు ఎబికె ప్రసాద్ మాట్లాడుతూ తమ్మారెడ్డి కృష్ణమూర్తి, కృష్ణవేణి దంపతులు సి.ఆర్. ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమ స్థాపనలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. తమ తుదిశ్వాస వరకు ఆశ్రమంలో ఉంటూ సి.ఆర్. ఫౌండేషన్ అభివృద్ధికి పాటు పడ్డారని గుర్తు చేసుకున్నారు. మల్లంపాటి వెంకటేశ్వర రావు, మేనేజర్ శ్రీనివాస్ సత్యవతి, సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.అలాగే కృష్ణమూర్తి, కృష్ణవేణి దంపతుల కుమారుడు, ప్రముఖ సిని దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, కోడళ్ళు వాణి, పూర్ణిమ, లెనిన్ తదితర కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## మంత్రి కుమారుడికి కస్టమ్స్ అధికారుల నోటీసు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తనయుడు హర్షారెడ్డికి కస్టమ్స్ అధికారులు గడియారాల కొనుగోలు కేసులో నోటీసులు జారీ చేశారు. హర్షారెడ్డి మోబీన్ అనే వ్యక్తి వద్ద ఒక్కో గడియారం రూ.1.75కోట్ల చొప్పున రెండు గడియారాలను కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. భారతదేశంలో లేని రెండు కంపెనీలకు చెందిన రెండు గడియారాలను మోబీన్ నుండి నవీన్ అనే మధ్యవర్తి ద్వారా కొనుగోలు చేసి హవాలా రూపంలో డబ్బులు చెల్లించాడని కస్టమ్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల నాలుగున హాజరు కావాలని కస్టమ్స్ అధికారులు నోటీసులు ఇవ్వగా జ్వరంతో బాధపడుతున్నానని హర్షారెడ్డి సమాధానం ఇవ్వడంతో ఏప్రిల్ 27న హాజరు కావాలని మరో మారు నోటీసు జారీ చేశారు. కస్టమ్స్ అధికారులు దీనికి సంబంధించి ఫిబ్రవరి ఐదున కేసు నమోదు చేశారు. ఇప్పటికే నవీన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

## పులి దాడిలో ఆవు మృతి

**ప్రజాపక్షం/బెజ్జూర్/పెంచికల్ పేట్ : పులి దాడిలో** ఆవు మృతి చెందిన సంఘటన బెజ్జూర్ అటవీ రేంజ్ లో ఆదివారం చోటు చేసుకుంది బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం బెజ్జూరు మండలం పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన గుర్లె శంకర్ ఆవు శనివారం ఉదయం సిద్దాపూర్ అటవీ ప్రాంతానికి మేతకు వెళ్ళగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్న పులి దాడి చేయడంతో, ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలాన్ని చిన్న సిద్దాపూర్ బీట్ అధికారి వెంకటేష్ ఆదివారం సందర్శించారు బెజ్జూర్ రేంజ్ లోని అటవీ ప్రాంతంలో పులి కదలికలు ఉన్నట్లు తెలిపారు. నివేదిక ను ఉన్నతాధికారులకు అందజే స్తామని అన్నారు. ఆర్థిక సహాయం అందించాలని బాధితులు బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్ ఫిర్యాదు చేశారు.



## ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

### మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ఆరోపించారు. గతంలో తుక్కుగూడలో సభను ఏర్పాటుచేసి,అడ్డమైన హామీలతో అధికారంలోకి వచ్చి, ప్రజలను మోసం చేశారన్నారు. మాజీ ఎంఎల్ఎ గాదరి కిషోర్ కుమార్, వి.నరసింహాతో కలిసి జగదీశ్ రెడ్డి హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 9 నాడే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీనిచ్చి మోసం చేశారన్నారు. పార్టీ మారితే మరుక్షణమే డిస్ క్వాలిఫై చేస్తామని ఎఐసిసి మ్యానిఫెస్టోలో చెబుతున్నారని, మరోవైపు తుక్కుగూడ సభలో తమ పార్టీకి చెందిన ఎంఎల్‌ఎను పక్కనే కూర్చోబెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలేనని ఆరోపించారు. రైతులకు అవసరమైన పనులు ఏం చేసిన బిఆర్ఎస్ అభ్యంతరం చెప్పబోదని తాము స్పష్టంగా చెప్పామని, ఈ విషయమై అవసరమైతే ఇసికి లేఖ రాస్తామని కెసిఆర్ చెప్పిన విషయాన్ని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెబుతున్నారని, ఇప్పుడు ఆ కాళేశ్వరం పంపును ఆన్ చేసి నీళ్లు ఇచ్చారన్నారు. కెసిఆర్ హయాంలో కేసులు గురుంచి తాము ఎన్నడూ మాట్లాడలేదన్నారు. అభివృద్ధి పైనే తాము దృష్టి కొనసాగిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25,000 లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కిరణ్‌కుమార్‌రెడ్డిని ఐదులక్షల మెజారిటీతో గెలిపించాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/తుంగతుర్తి (అర్వపల్లి):** 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మందుల సామేలును ఏ విధంగానైతే తుంగతుర్తి ప్రజలు 50వేల పై చిలుకు మెజార్టీతో గెలిపించారో అదే విధంగా గత 15 సంవత్సరాలుగా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో అనునిత్యం పార్టీ కోసం కష్టపడిన వ్యక్తి అనేక ఉద్యమాలు పోరాటాలు చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడానికి అత్యంత క్రియాశీలకంగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ భువనగిరి



పార్లమెంట్ అభ్యర్థి శ్రీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కూడా అదే విధంగా ఐదులక్షల మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తుంగుర్తి ప్రజలను,భువనగిరి నియోజకవర్గ కార్యకర్తుల, నాయకులు, ప్రజలను కోరారు. ఆదివారం భువనగిరి పార్లమెంట్ పరిధిలోని తుంగతుర్తి నియోకవర్గంలోని అర్వపల్లి మండలంలోని అడివివేముల గ్రామంలో గ్రామదేవత అయిన శ్రీ ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఐదు గ్యారెంటీల గురించి వివరించాలని, నెలరోజులు కష్టపడండి హస్తం గుర్తుపై ఓటు చేయాలని ప్రచారం చేయాలన్నారు. 30 రోజులు మీరు కష్టపడండి 48 నెలలు మేము మీకు అండగా ఉంటాము అర్ధరాత్రి అయిన అపరాత్రి అయిన మీకు ఏ ఇబ్బంది కలిగిన మీ ముంగిట ఉంటామని భరోసా ఇచ్చారు. ఐదు సంవత్సరాలుగా మీకు అండగా మేము ఉంటాము మీకు ఏ కష్టం వచ్చిన మంత్రిగా నేను వస్తాను ఎమ్మెల్యే సామేల్ వస్తారు, ఎంపిగా కిరణ్‌కుమార్‌రెడ్డి వస్తారు, మా జిల్లా నాయకులు వచ్చి ఆదుకుంటారని మీకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ లాగా దోచుకుతినే పార్టీ కాదు కాంగ్రెస్ పార్టీ అంటే పేదప్రజలను ఆదుకోవాలని సోనియా గాంధీ ఆనాడు ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభించి పేదప్రజలకు కడుపునింపారని గుర్తు చేశారు. నెలరోజులు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలను, నాయకులను, ప్రజలను కోరారు. మంత్రి వెంట తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, భువనగిరి ఎంపి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష నేతల నిర్బంధం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు

* ‘ఇండియా’ కూటమి నేతలు
* కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఆప్ సామూహిక నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**చట్టవిరుద్ధంగా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అని ‘ఇండియా’ కూటమి నేతలు అన్నారు. ఈడి, సిబిఐ, ఐటి సంస్థలు బిజెపికి రాజకీయ ఆయుధాలుగా పనిచేస్తున్నాయని, ప్రతిపక్ష నేతలపై నిర్దాక్షిణ్యంగా దాడులు, బూటకపు కేసులు, అరెస్టులు ప్రధాని నరేంద్ర మోడీ నయా నియంతృత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సామూహిక నిరాహార దీక్షలు చేపట్టాలని ఆప్ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కమిటీ వందలాదిమంది ఆప్ శ్రేణులతో సామూహిక నిరాహార దీక్షలు చేపట్టింది.

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సామూహిక నిరాహార దీక్షలకు తెలంగాణ రాష్ట్ర ‘ఇండియా’ కూటమి నేతలు కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు జూలకంటి రంగారెడ్డి, ఆర్.ఎస్.పి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకిరామ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.ఆర్.జి. వినోద్ రెడ్డి తదితరులు దీక్షా శిబిరానికి వచ్చి మద్దతు ప్రకటించి, తమ సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, సోలోమన్ రాజ్, ఎం.ఎ. మజీద్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్, యమున గౌడ్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, దివ్యాంగ విభాగం కన్వీనర్ దర్శనం రమేష్, యువజన విభాగం అధ్యక్షులు విజయ్ ముల్లంగి, నేతలు కొడంగల్ శ్రీనివాస్, శివాజీ, మౌనిక, అఫ్జల్ తదితరులు పాల్గొన్నా రు.

**కేజ్రీవాల్ అరెస్ట్ రాజకీయ ప్రతీకారమే : బాలమల్లేష్**

ఈ సందర్భంగా ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలపై రాజకీయ ప్రతీకారం తీర్చుకునేందుకు బిజెపి ఈడి, సిబిఐలను ఉపయోగించడం దుర్మార్గమన్నారు. రఫేల్, ఎలక్ట్రోరల్ బాండ్స్ కుంభకోణం లాంటి అనేక ఆరోపణలు ప్రధానిపై, ఆయన ప్రభుత్వంపై వచ్చాయన్నారు. దానికి ప్రధాని ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ బిజెపి రాజకీయ ప్రతీకారంలో భాగమేనని మండిపడ్డారు.

**భయంతోనే కేజ్రీవాల్ అరెస్ట్ : సుధాకర్**

డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ బిజెపిని చావుదెబ్బతీస్తాడనే భయంతో మోడీ ప్రభుత్వం ఆయనను ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచేందుకే అక్రమ కేసులతో జైలులో పెట్టిందన్నారు. ఆప్ నేతలతో ముడిపడి ఉన్న మద్యం కేసులో ఈడి, సిబిఐ ఒక్క కేసులో కూడా సాక్ష్యాలు చూపించలేకపోయాయని, ఇదే కేసులో అరెస్టు అయిన మద్యం వ్యాపారి శరత్ చంద్ర రెడ్డి బిజెపికి ఎలక్ట్రోరల్ బాండ్‌ల రూపంలో రూ.55కోట్లు ఇవ్వగానే ఈ.డి ఆయనకు ఎలాంటి షరతులు లేకుండా బెయిల్ ఇప్పించిందని విమర్శించారు. వేల కోట్ల ఎన్నికల బాండ్‌ల కుంభకోణానికి పాల్పడి రాజ్యమేలుతుందన్నారు. ప్రజలు బిజెపికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

**ప్రతిపక్షాలను నిర్బంధిస్తే ఊరుకోం : బల్మూరి వెంకట్**

బల్మూరి వెంకట్ మాట్లాడుతూ బిజెపి తమ కుటిల రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని మండిపడ్డారు. ప్రజలచే ఎన్నుకోబడిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మోడీ తన నియంతృత్వ చర్యలతో ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తే ఉరుకునేదిలేదన్నారు.

**ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకే బిజెపి కుట్రలు – జూలకంటి రంగారెడ్డి :** జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ అత్యంత దుర్మార్గపు పాలన కొనసాగిస్తూ దేశంలో ప్రతిపక్షమే లేకుండా చేసేందుకు తన నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎలక్ట్రోరల్ బాండ్స్ ప్రపంచంలోనే అతిపెద్ద స్కామ్ : వినోద్ రెడ్డి**

ఎంఆర్‌జి. వినోద్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రోరల్ బాండ్స్ ద్వారా బిజెపి ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణానికి పాల్పడిందన్నారు. ప్రపంచంలోనే అవినీతి రాజకీయ పార్టీగా బిజెపి మొదటి స్థానంలో ఉందని విమర్శించారు. ఈడి, సిబిఐలు బిజెపి నేతలపై దాడులు చేసి, వారి అవినీతిని బట్టబయలు చేయాలన్నారు.

## జర్నలిజం విలువలు కాపాడాల్సింది జర్నలిస్టులే

### మహబూబ్‌నగర్ సమావేశంలో విరాహత్ అలీ






**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** జర్నలిస్టుల ముసుగు ధరించి, కొన్ని అసాంఘిక శక్తులు చేస్తు న్న అరాచకాలతో దిగజారిపోతున్న జర్నలిజం విలువలను పరిరక్షించు కోవాల్సిన బాధ్యతా జర్నలిస్టులపై ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టియుడబ్ల్యుజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ పిలుపునిచ్చారు. జర్నలిస్టు లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య తమ కర్తవ్యాన్ని నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఆయన సూచించారు. ఆదివారం నాడు మహబూబ్ నగర్ పట్టణంలోని డిసిసిబి ఆడిటోరియంలో జరిగిన జిల్లా టియుడబ్ల్యుజె సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు దండు దత్తేంద్ర అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ రాష్ట్ర కార్యదర్శి పేపర్ శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, గడిచిన పదేళ్ల కాలంలో రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో టియుడబ్ల్యుజే సభ్యులపై కొందరు అధికారాన్ని అడ్డుపెట్టుకొని కక్ష్యపూరితంగా వ్యవహరించి, అనే క ఇబ్బందులకు గురిచేస్తూ తమ వైపు లొంగదీసుకునే ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదన్నారు. టియుడబ్ల్యుజే మొదటి నుండి తమ సభ్యులకు సైద్ధాంతిక పరమైన నైతిక విలువలు నేర్పిందని విరాహత్ స్పష్టం చేశారు.



అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా, కేవలం జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసమే తమ సంఘం పనిచేసిందన్నారు. ఈ సంఘం ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు చేసి 65 ఏళ్ల కాలంలో జర్నలిస్టుల సంక్షేమంకోసం ప్రభుత్వాలతో కొట్లాడి అనేక పథకాలను సాధించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల సానుకూలం గా ఉందని, ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ విషయాన్ని వెల్లడించారని ఆయన అన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకునే పరిస్థితి లేద ని, ఎన్నికల తర్వాత ప్రధానమైన ఇళ్ల స్థలాలు, ఇండ్లు, హెల్త్ కార్డులు తదితర సౌకర్యాలపై మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం వచ్చేలా యూనియన్ ప్రయత్నం చేస్తుందన్నారు. సమావేశం అనంతరం జిల్లాలో వివిధ పత్రికలు, చానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు 143 సంఘానికి రాజీనామా చేసి, విరాహత్ సమక్షంలో టియూడబ్ల్యూజెలో చేరారు. అనంతరం ఇటీవల రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్ని కై, మహబూబ్ నగర్ జిల్లాను పర్యటించిన విరాహత్ అలీని జిల్లా కమిటీ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఎలక్ట్రానిక్ మీడి యా జిల్లా అధ్యక్షులు జెమిని శేఖర్ గౌడ్ సీనియర్ జర్నలిస్టులు విజయరాజు, అహ్మద్ పాషా, విద్యా సాగర్‌రెడ్డి, వెంకటేష్, మని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

**ఎంఎల్‌ఎను ఘనంగా సత్కరించిన వర్కింగ్ జర్నలిస్ట్‌లు**

తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని డిసిసిబి ఆడిటోరియంలో మహబూబ్ నగర్ ఎంఎల్‌ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డిని శాలువా, బొకే, మొమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విరాహత్ అలి, రాష్ట్ర కార్యదర్శి పేపర్ శ్రీనన్న, జిల్లా అధ్యక్షులు డి.దత్తేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు జెమిని శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. .




## పంట నష్టంపై అబద్ధాలు మాట్లాడుతున్నారు

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంటల నష్టంపై బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు శుద్ధ అబద్ధాలు మాట్లాడుతున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు.వర్షాకాలంలో మహారాష్ట్ర, కర్నాటక సహా తెలంగాణలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడంతో నదుల్లో నీళ్ల పారడం లేదని, బావులు, బోర్లు రీఛార్జ్ కాలేకపోయాయని, దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల ఎకరాలు వరకు పంటలు ఎండిపోతే బి ఆర్ ఎస్ నాయకులు కెసిఆర్, హరీష్ రావు పదింతల సంఖ్య పెంచి, 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని చెప్పడం శుద్ధ అబద్ధమన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమిరెడ్డి కృపాకర్ రెడ్డి ఆత్మీయ సన్మానం కార్యక్రమంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు,రిటైర్డ్ ఉద్యోగులు,అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ పొలాలు ఎండిపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా రైతుల్లో ఉందన్నారు. కానీ రాజకీయ నిరుద్యోగులైన కెసిఆర్, హరీష్ రావులు అనవసరంగా నానా హైరానా పడుతున్నారని, ఇది ఎందుకో అర్థం కావడం లేదని అన్నారు. పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కెసిఆర్,హరీష్ రావు వర్షాభావ పరిస్థితులను ఎందుకు అర్థం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ అధ్యయనాన్ని విశ్లేషించి ఆ తర్వాత మండల, జిల్లా రాష్ట్ర స్థాయిలో వీటిని అమలు చేసేందుకు కృషి చేస్తామని చిన్నారెడ్డి తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్ కుమార్, మాజీ ఐఎఎస్ అధికారి చిత్తరంజన్ బిశ్వాస్, వ్యవసాయ శాఖ ఉద్యోగులు అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు వైద్యనాథ్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా.. తరగతులు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తార్నాక పరిధిలో క్లాసులు నిర్వహిస్తున్న వెంకన్న జూనియర్ కళాశాలలో గుర్తింపు రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా, ఒయు కౌన్సిల్‌ల ఆధ్వర్యంలో కళాశాల ముందు ధర్నా నిర్వహించి, తరగతులను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ అధ్యక్షులు చైతన్య యాదవ్, ఒయు కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డు మార్చి 31 నుండి మే 31 వరకు ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ ఇంటర్ కళాశాలలు వేసవిలో ఎటువంటి తరగతులు నిర్వహించవద్దని, అడ్మిషన్లు ప్రారంభించకూడదని నోటీ సు జారీ చేసిందని తెలిపారు. కానీ తార్నాకలోని వెంకన్న జూనియర్ కళాశాల ఈ నిబంధనలను పాటించకుండా తరగతులు నిర్వహిస్తుందన్నారు. కావున వెంటనే ఆ కళాశాల గుర్తింపును ర ద్దు చేయాలని ఇంటర్ బోర్డు అధికారులను డిమాం డ్ చేశారు. అలాగే శ్రీ చైతన్య, నారాయణ ఇతర జూనియర్ కళాశాలలు కూడా నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తూ అడ్మిషన్లను ప్రారంభించాయన్నారు. వెంటనే అధికారులు దృష్టి సారించాలని కోరారు. అక్రమంగా వేసవికాలంలో తరగతులు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలపైన చర్య లు తీసుకోవాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు కళ్యాణ్, అనిల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## జీవితాంతం ప్రజాసేవలోనే ఉంటా..

### మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** జీవితాంతం ప్రజా సేవలో ఉంటానని మాజీ మంత్రి ఎంఎల్‌ఏ తన్నీరు హరీష్ రావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని లిమ్రా గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతూ సిద్దిపేట గంగా జమునా తహజీద్‌కు కేంద్ర బిందువని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న లేకున్న నిరంతరం ప్రజల కోసమే పని చేస్తానని అన్నారు. నిరుపేద మహిళలు ఉపాధి పొందాలనే లక్ష్యంతో నా సొంత డబ్బులతో కుట్టు మిషన్‌లను అందించానని అన్నారు. మధీన ఫంక్షన్ హాలుకు ప్రత్యేక నిధులు కేటాయించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు కావలసిన సామాగ్రిని సమకూర్చుకున్నామని అన్నారు. ఇఫ్తార్ విందులో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్ రామిరెడ్డి, మాజీ ఎంఎల్‌సి ఫారుక్ హుస్సేన్,తంజిం ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, సమి, ప్రజాప్రతినిధులు,నాయకులు కడవెర్గ రాజనర్సు, పాల సాయిరాం,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దేశం దారెటు?

### మాటలతో దూరం చేసుకుంటున్న బిఆర్ఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి అవునన్నా కాదన్నా స్థిరమైన ఓటు బ్యాంకు ఉంది. కొన్ని జిల్లాలలో ప్రభావిత శక్తిగా ఉంది. ఓ సామాజిక వర్గంలోని కొందరితో పాటు దశాబ్దాలుగా తెలుగుదేశం అభిమానులుగా ఎందరో ఉన్నారు. ఇప్పటికీ యువతలో టిడిపి పట్ల ఒక చర్చ సాగుతుండడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాలు పక్కనే ఉన్న మన రాష్ట్రం పైనా ప్రభావితం చూపుతాయనడంలో సందేహం లేదు. మే మాసంలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో దేశం పార్టీ దారెటు అన్న చర్చ సాగుతుంది. రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభావం ఉన్న చోట మరింత ఆసక్తి నెలకొంది. 2018 ఎన్నికల్లో మహా కూటమిలో ఉండి రెండు చోట్ల గెలుపొందింది. అవి కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, సత్తుపల్లి. వారు కూడా కారు ఎక్కడంతో 2023లో ఎక్కడ పోటీ చేయలేదు. ఈ నిర్ణయం పై అలిగి ఆ పార్టీకి చెందిన నాయకులు పార్టీ నాయకత్వంపై కోపంతో బిఆర్ఎస్‌లోను, ఇతర పార్టీలలోను చేరారు. గడిచిన ఐదేండ్ల కాలంలో చంద్రబాబు నాయుడు తెలంగాణలో టిడిపిని బలోపేతం చేసేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. ఒకట్రెండు చోట్ల సభలు పెట్టిన అవి కాంగ్రెస్‌కు ఎక్కువగా ఉపయోగ పడింది. తెలంగాణలో బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య కొన్ని చోట్ల ద్విముఖ, మరికొన్ని చోట్ల త్రిముఖ పోటీ నడుస్తుంది. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, బిజెపి, జన సేన పార్టీల మధ్య పొత్తు ఉంది. శాసన సభ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటి రామారావు చంద్రబాబు నాయుడు పట్ల మాట్లాడిన తీరు టిడిపి ఓటర్లను బిఆర్ఎస్‌కు శత్రువులుగా మార్చి వేసింది. చాలా మంది బిఆర్ఎస్ తరుపున పోటీ చేసిన అభ్యర్థులు కేటిఆర్ మాటలకు అంతర్మథనం చెందారు. ఇప్పుడు ఖమ్మంతో పాటు మరికొన్ని చోట్ల టిడిపి నుంచి కాస్తో కూస్తో మద్దతు దొరుకుతుందనుకుంటే కేసిఆర్ చంద్రబాబు పై చేసిన వ్యాఖ్యలు టిడిపి క్యాడర్‌లో అగ్గి రగిల్చాయి. ఇప్పుడు బిజెపితో పొత్తులో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వలేక, స్వతంత్రంగా పోటీ చేయలేక, బిజెపి శ్రేణులతో కలిసి పని చేయలేక టిడిపిలో మిగిలిన క్యాడర్ సతమతమవుతుంది. ఇదిలా ఉంటే పుండు మీద కారం చల్లినట్లు నందమూరి సుహాసిని కాంగ్రెస్ టికెట్ కోసం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో దేశం దారేటో....?

## ప్రజాపాలన కాదు.. ప్రతీకార పాలన

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన పేరుతో ప్రతీకార పాలన సాగిస్తున్నారని బిఆర్ఎస్ నాగర్ కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. పార్లమెంటు ఎన్నిక ల సన్నాహక సమావేశంలో భాగంగా ఆదివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తుక్కుగూడ వేదికగా ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా గారడీల పాలన సాగిస్తున్నారని విమర్శించారు.

కరీంనగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో బిఆర్ఎస్ నేతలపై పోలీసులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు ఏర్పడి పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మళ్లీ కేంద్రంలో మూడోసారి బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతి ఆధారంగా అలహాబాద్‌లో కొంత మంది హిందుత్వ వాదులు రాసిన హిందుత్వ రాజ్యాంగాన్ని అమలు చేస్తారని తెలిపారు. రాజ్యాంగం రద్దయితే హక్కులు కోల్పోతామన్నారు. రాజ్యాన్ని రక్షించుకునేందుకు పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కరీంనగర్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ పదేళ్లు పాలించి అభివృద్ధిలో దేశంలో అగ్రగామిగా నిలిపిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు. ఆంధ్రాపాలనలో కరువుతో అల్లాడిన తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు కట్టి కోటి ఎకరాలకు సాగునీరు అందించిన పార్టీ బిఆర్ఎస్‌దే నన్నారు. దేశంలో దళితుల ఆర్థికాభివృద్ధికి కోసం బ్యాంకుల్లో ఎలాంటి పూచీకత్తు లేకుండా దళితబంధును ప్రవేశపెట్టి దళితులకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేసిన ఘనత కెసిఆర్‌దేనన్నారు. బిఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుంది తప్ప కాంగ్రెస్‌తో సాధ్యం కాదన్నారు. సమావేశంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సీనియర్ నాయకులు తుల ఉమ, గెల్లు శ్రీనివాస్ యాదవ్, పలువురు జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సాహితీ విహారి

## స్వాతంత్ర్య ఉద్యమాన్ని మలుపుతిప్పిన 'వందేమాతరం'

భారత దేశానికి బంకించంద్ర చటర్జీ అందించిన 'వందేమాతరం' గేయం ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. ప్రజల్లో నిద్రాణమై ఉన్న పౌరుషాన్ని రగిల్చింది. అందుకే ఆయనను భారత స్వాతంత్ర్య పోరాటానికి నిప్పుకణిక లాంటి నినాదాన్ని అందించిన రచయితగా పేర్కొంటారు. నాటి ప్రజలను, విశేషించి యువతను దేశభక్తి భావనలో ఉర్రూతలూగించిన 'వందేమాతరం' తారక మంత్రాన్ని ఉపదేశించిన ఘనాపాటి. వందేమాతరం గీతం యావత్ భారతంలో మారుమోగింది. స్వాతంత్ర్య ఉద్యమ సమర శంఖారావమైంది. 'వందేమాతరం' అంటూ లక్షలాది మంది ప్రజలు బ్రిటిష్ పాలనను ధిక్కరించారు. సైన్యానికి ఎదురొడ్డారు. త్యాగాలు చేశారు. చివరికి 'వందేమాతరం' అంటూ ఉరితాడును మెడకు తగిలించుకొని, దేశం కోసం ప్రాణాలు త్యాగం చేశారు. మన దేశంలోనేకాదు... ప్రపంచ దేశాల్లోనే ఒక గీతం ప్రజల్లో ఇంతటి పోరాట స్ఫూర్తిని నింపిన సందర్భం ఎక్కడా లేదు. ఇకపై రాదు కూడా. అప్పటి వరకూ మితవాదుల నేతృత్వంలో కొనసాగిన స్వాతంత్ర్య పోరాటంలో అతివాద ధోరణులకు అంకురార్పణ ఒక గేయం ద్వారా జరగడం విచిత్రం. 'ఆనంద్‌మఠ్' నవల్లోని వందేమాతరం గేయమే, 'లాల్ బాల్ పాల్'గా ప్రసిద్ధి పొందిన లాలా లజపత్ రాయ్, బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్ర పాల్ ఆలోచనా విధానానికి ఒక రూపాన్ని ఇచ్చినట్టు కనిపిస్తుంది. 'వందేమాతరం' ఒక ఉద్యమ నినాదంగా మార్చిన ఘనత బిపిన్‌చంద్ర పాల్‌కే దక్కుతుంది.

దేశ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించిన ఆయన, ఈ నినాదంతోనే ప్రజలకు చేరువయ్యారు. ఆ తర్వాత వందేమాతర ఉద్యమం దేశమంతటా ఉవ్వెత్తున ఎగసిపడింది. భారత ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్షను సజీవంగా నిలబెట్టింది. బ్రిటిష్ పాలకుల వెన్నులో వణుకు పుట్టించింది. ఒక గొప్ప దేశభక్తి గేయాన్ని రచించిన బంకించంద్ర ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో అగ్రగణ్యుడయ్యారు. ఒక్క బెంగలీ సాహిత్యాన్నే కాకుండా.. భారతీయ సాహిత్యాలను ఆయన ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేశారు. ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం ప్రజలను ఉత్తేజపరిచి, ఉద్యమింపచేసిన సంఘటన మన దేశంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా చోటు చేసుకోలేదు. స్వాతంత్ర్యోద్యమం నిర్ణాయకమైన మార్గంగా, చైతన్యదీప్తిగా మారడంలో వందేమాతర గీతం కీలక పాత్ర పోషించింది. ఆనంద్‌మఠ్ ఒక్కటేకాదు.. బంకించంద్ర రచనల్లో ఎక్కువ శాతం దేశభక్తి, సామాన్యుడి కోణంలో అప్పటి సమాజ తీరుతెన్నులు కనిపిస్తాయి.

1838, జూన్ 27న ప్రస్తుత పశ్చిమ బెంగాల్‌లోని నైహతిలో జన్మించిన బంకించంద్ర ఒక రచయిత, కవి, నవలా రచయిత, వ్యాసకర్త, జర్నలిస్టు, ప్రభుత్వ అధికారి.... వెరసి బహుముఖ ప్రజ్ఞాశాలి. పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రపై తనదైన ముద్ర వేశారు. బంకించంద్ర రచనలు ఉదాత్త ఆదర్శాలకు, రవీంద్రుడి రచనలు కాల్పనిక సౌందర్య తాత్వికతకు, శరత్ రచనలు సమాజ వాస్తవికతకు దర్పణాలు. భారతీయ వాఙ్మయంలో ధర్మప్రతిష్ఠాపన, నీతి, ఆదర్శం, సత్యం, అనుపాలించే పురాణ పాత్రలలాగ బంకించంద్రుడి కాల్పనిక, వీర శృంగార, ఐతిహాసిక నవలల్లో ఆయన సృష్టించిన పాత్రలు పాఠకులను ఆకట్టుకుంటాయి. సమ్మోహితుల చేస్తాయి. నిజానికి ఆయన పాత్రలు కాల్పనిక సాహిత్యానికి చెందినవే అయినప్పటికీ, వాటిని ఆయన మలచిన తీరు అద్భుతం. అనన్యసామాన్యం. అందుకే, సాహిత్య విమర్శకులు ఆయనను ఎన్నో ప్రత్యేకతలు ఉన్న రచయితగా పేర్కొంటారు. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యానాది రచనలతో బంకించంద్ర సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. తన మొదటి బెంగాలీ రచన 'దుర్గేష్‌నందిని' ఒక నవల. కానీ, తాను నవలా రచయితగా మిగిలిపోవాలని ఆయన అనుకోలేదు. నవల కంటే కవిత్వానికే ఆయన అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. హుగ్లీ కాలేజీ, ప్రెసిడెన్సీ కాలేజీల్లో విద్యాభ్యాసం కొనసాగుతున్న సమయంలోనే, ఆయన సాహితీ ప్రస్థానం కూడా కొనసాగింది. ఆయన రాసిన 'ఆనంద్‌మఠ్' నవల్లో నిజానికి వందేమాతర గేయం లేదు. కానీ, ఆ తర్వాత ఆయన దానిని నవలలో జోడించారు. విశ్వగురువు రవీంద్రనాథ్ ఠాకూర్ ఆ గేయానికి బాణీ సమకూర్చారు. ఆ తర్వాత వందేమాతర గేయం




సృష్టించిన ప్రకంపనల గురించి ప్రత్యేకంగా పేర్కోవాల్సిన అవసరం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇది జాతీయ వాదానికి ప్రతీకగా, మారుపేరుగా మారింది. 1894 ఏప్రిల్ 8న బంకించంద్ర తుదిశ్వాస విడిచారు. ఆ తర్వాత 12 సంవత్సరాలకు, బిపిన్‌చంద్ర పాల్ తాను మొదలు పెట్టిన రాజకీయ పత్రికకు 'వందేమాతరం' అని పేరు పెట్టారు. లాలా లజపత్ రాయ్ సైతం అదే పేరుతో ఒక జాతీయవాద పత్రికను ప్రచురించారు. 1870లో బంకించంద్ర రచించిన వందేమాతరం గేయం, ఆ తర్వాత కొన్ని దశాబ్దాలపాటు స్వాతంత్ర్య సమరంలో చోదకశక్తిగా ఉపయోగపడింది.


భారత రాజ్యాంగాన్ని లిఖిస్తున్న సమయంలో, ఈ గేయానికి జాతీయ గుర్తింపు లభిస్తుందని అంతా అనుకున్నారు. కానీ, జాతీయ గీతంగా రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'జనగణమన అధినాయక జయహే' ఎంపికైంది. 1950 జనవరి 24న, భారత తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ వందేమాతరం గీతానికి జాతీయ గేయం హోదా కల్పించారు. ఒక గొప్ప దేశభక్తి గేయాన్ని అందించిన బంకించంద్ర చిరస్మరణీయుడు.

సత్యశ్రీ

నిజానికి బంకించంద్ర చటర్జీ అసలు పేరు బంకించంద్ర చటోపాధ్యాయ. కానీ బ్రిటిష్ వారు పలకలేక చటర్జీ అని పిలిచారు. చటర్జీ పేరే స్థిరపడింది. ఆయనకు 'సాహిత్య సామ్రాట్' అనే బిరుదు ఉండేది. ప్రఖ్యాతి చెందిన 'ఆనంద్‌మఠ్' నవల్లో ఆయన అప్పటి బెంగాల్ కరువు పరిస్థితులను కళ్లకుగట్టారు. అప్పట్లో బాల్య వివాహాలు జరిగేవి. అదే క్రమంలో బంకించంద్రకు 11 ఏళ్ల వయసులో పెళ్లి జరిగింది. అయితే మొదటి భార్య మరణించడంతో రాజ్యలక్ష్మి దేవిని ద్వితీయ వివాహం చేసుకున్నారు. వీళ్ళిద్దరికీ ముగ్గురు కూతుళ్లు. 'ఆనంద్‌మఠ్'లో బెంగాల్ కరువును గురించేగాక, ఈస్ట్ ఇండియా కంపెనీని, ఎలాంటి శిక్షణాలేని భారత సైన్యం ఎంతో సమర్థంగా ఎదుర్కొన్నట్టు చూపారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ బెంగాలీతోపాటు ఇంగ్లీషులోనూ రచనలు చేసేవారు. బంకించంద్ర కూడా ఇంగ్లీష్ లో రచనలు చేయాలనుకున్నారు. కానీ,ఆ భాషపై తనకు చెప్పుకోదగిన పట్టు లేదని గ్రహించి, ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆనంద్‌మఠ్‌తోపాటు దుర్గేశ్ నందిని, కపాల్ కుండల, చంద్రశేఖర్, రజని వంటి నవలలు కూడా రాశారు. ఆయన సృష్టించిన పాత్రలన్నీ జీవ చైతన్యానికి, వాస్తవిక మూర్తిమత్వానికి నిదర్శనంగా ఉంటాయి. ఆయన సమకాలీనుల్లో ఎవరూ ఈ విధంగా ఉదాత్త పాత్రలను తమ రచనల్లో తీర్చిద్దలేదు.

బంకించంద్ర రచనల్లో ఉన్న స్త్రీ పాత్రలు పురుష పాత్రలకు ఏ మాత్రం తీసిపోవు. నవలల్లో వివిధ సంఘటనలను ఆయన వివరించే తీరు పాఠకులను అమితమైన ఉత్కంఠకు లోనుచేస్తుంది. ఇతివృత్తం లో.. శైలిలో.. సన్నివేశ పరికల్పనలో ఆయనకు ఆయనే సాటి.



ఆయన సృజనాశక్తి అద్భుతం. కథనాన్ని ముందుకు తీసుకెళ్లే తీరు అనన్య సామాన్యం. అందుకే, ఆయన నవలల్లోని సంఘటనలు, పాత్రలు చదువరులను కొత్త లోకాలకు తీసుకెళతాయి. గొప్ప అనుభూతికి లోను చేస్తాయి.

'వందేమాతరం' గేయంలో దేశానికి దేవుడి రూపం ఇచ్చారని, కాబట్టి జాతీయ గీతంగా పనికిరాదని అప్పటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ భావించారు. ముస్లిం లీగ్ సైతం ఈ గీతాన్ని వ్యతిరేకించింది. అయితే, దేశ ప్రజలంతా వందేమాతరంలో స్వాతంత్ర్య కాంక్షను చూశారే తప్ప, మత కోణాన్ని వెతకలేదు. అందుకే, ఈ గేయం అంతగా ప్రజల్లోకి వెళ్లింది. స్వాతంత్ర్యకాంక్షను రగిల్చింది. దేశం నుంచి బ్రిటిషర్లను తరిమికొట్టడానికి, స్వాతంత్ర్యం సంపాదించుకోవడానికి ఆయుధంగా ఉపయోగపడింది. ఇది కేవలం ఒక కవితగానో.. గేయంగానో కాకుండా, ఒక ఉద్యమ నిర్మాణానికి సంపూర్ణమైన మేనిఫెస్టోగా నిలిచింది.

ప్రజల్లో తిరుగులేని ధైర్యాన్ని నింపిన వందేమాతర గీతాన్ని అందించిన బంకించంద్ర ధన్యుడు. నిజమైన దేశ భక్తులు. పరోక్షంగా ఆయన నిర్మించిన ఉద్యమమే నాటి మేటి నాయకులకు ఆయుధమైంది. వలసపాలనకు తెరదించిన ఘనతను ఆపాదించింది. నిజానికి నేడు యావత్ దేశం ఘనంగా కీర్తిస్తున్న ఎంతోమంది నాయకుల కంటే బంకించంద్ర పేరునే భారత స్వాతంత్ర్యోద్యమంలో ముందుగా ప్రస్తావించాలి.

---

## సామాజిక రుగ్మతలపై అక్షర యుద్ధం 'దాస్తాన్'

పుస్తక సమీక్ష

ఏదో ఒకటి రాయడం సులభమేకానీ, సమాజంలో ఉన్న కుళ్లును కడిగేసేందుకు మాత్రం కొండంత ధైర్యం కావాలి. జీవితం విధించిన కట్టుబాట్లు, నిబంధనల నుంచి బయటకు వచ్చి, వాస్తవాలను ఆవిష్కరించాలి. అనుభవాలను అక్షర రూపంలోకి మార్చాలి. సమస్యలకు ఎదురొడ్డి పోరాడే స్ఫూర్తిని పాఠకుల్లో రగిలించాలి. అజ్ఞానాన్ని విడిచిపెట్టి, అజ్ఞాతం నుంచి బయటపడి, ప్రజాహితం కోసం అక్షర సేద్యం చేసినప్పుడే రచనలకు సార్థకత. ఉదాత్తమైన ఆలోచనలు... బాధితులకు వెన్నుదన్నుగా నిలిచే సిద్ధాంతాలు ఉన్నాయి కాబట్టే, నస్రీన్ ఖాన్‌ను అరుదైన రచయిత్రిగా పేర్కోవాలి. ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్షరబద్ధం చేయాలన్న ఆలోచన రావడ మే గొప్ప. భిన్న కోణాల్లో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ, పరిష్కారాలను చూపుతూ రాసిన పది కథల సంకలనమే 'దాస్తాన్'. మొదటి కథ 'లాపతా' (అదృశ్యం) నుంచి చివరి కథ 'పాన్' వరకూ ప్రతి కథా పాఠకులను ఆకట్టుకుంటుంది. ఆలోచింప చేస్తుంది. కథను అల్లడం.. ఆ అల్లిన కథను ఆకట్టుకునేలా చెప్పడం అతి కొద్దిమందికే సాధ్యం. వారిలో నస్రీన్ ఖాన్ ఒకరు. 'తెలుగు అసోసియేషన్ ఆఫ్ అమెరికా' (టెల్సా) కథల పోటీలో ప్రచురణకు ఎంపికైన 'హద్దులకు ఆవల' కథకురాలిగా ఆమె ప్రతిభకు మచ్చుతునక. 'జఖ్మీ' (గాయం) కవితా సంకలనం మాదిరిగానే 'దాస్తాన్'లోనూ ప్రజా సమస్యలు, సమాజ పోకడలే ప్రధాన ఇతివృత్యాలు. 'లాపతా ' లో కనిపించకుండా పోయిన తన కుమారుడు రాహిల్ గురించి తల్లడిల్లిన రఫీకా, అతని జాడకోసం చేసిన పోరాటం, కొడుకు తిరిగి వచ్చిన తర్వాత కూడా, ఇంకా జాడ తెలియని పిల్లల కోసం గళం ఎత్తిన వైనం ఓ తల్లి మనసుకు ప్రతీకలు. అక్రమ కేసులను ఎండగట్టే రఫీకా పాత్రను నస్రీన్ అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆ కథ చదువుతున్నంత సేపు పిల్లల క్షేమంకోసం ప్రతి పాఠకుడు తల్లడిల్లుతాడు. అదృశ్యమైన పిల్లల కోసం ఆ తల్లి మొదలుపెట్టే యుద్ధానికి జై కొడతాడు. సమస్యల ఉరుములు, పెరుపులు, సుడిగాలులు, జడివానల్లో చిక్కుకొని అల్లాడుతున్న ఎంతోమందికి ఈ కథలు సరైన దారిచూపిస్తా యి. 'చీకటి తెరల మాటున నిలిచినా వెలుతురునేచూస్తున్న ప్రతి సోదరికి ప్రేమతో' ఈ పుస్తకాన్ని అంకితం ఇవ్వడంలోనే రచయిత్రి భావం ప్రతిబింబిస్తుంది.




జర్నలిస్టుగా ఏ విషయంలోనైనా లోతైన విశ్లేషణ చేయగల నైపుణ్యం ఉంది కాబట్టే, ఆమె కథల్లో జీవం, సన్నివేశాల్లో జీవనం, కథనంలో వైవిధ్యం ఉట్టిపడతాయి. 'నస్రీన్ ఖాన్ ఒక రచయిత. మహిళా రచయిత. ముస్లిం మహిళా రచయిత. ఈ విషయం అర్థమైనప్పుడు కచ్చితంగా మన చుట్టూ జరుగుతున్న విషయాల పట్ల పాఠకులకు గాని, విమర్శకులకుగాని ఒక అవగాహన వస్తుంది. మనం ఒక ప్రత్యేకమైన సమాజానికి న్యాయం చేయగలుతాము' అని ఈ పుస్తకం ముందు మాటలో అంటారు డాక్టర్ ఎస్‌కె సాబిరా. ఈ మాటలు అక్షర సత్యాలు.

'అర్ధపురుష్'లో హైదరాబాద్ పాతబస్తీలో ఛిద్రమైన జీవితాలు.. పురుషాధిక్య వ్యక్తిత్వాలు.. మహిళల కష్టాలు, కన్నీళ్లు కనిపిస్తాయి. చిన్నతనంలోనే పెళ్లి.. భర్త ఏం పని చేస్తాడో కూడా తెలియని అమాయకత్వం.. 11 మంది పిల్లలు... ఏదైనా ఉద్యోగం చేద్దామనుకున్నా అడ్డుపడే భార్య మధ్యతరగతి మనస్తత్వం.. ఏ రకంగానూ ముందుకు అడుగువేయలేని పరిస్థితులకు ఎదురొడ్డి, తనకు ఉన్న కొద్దిపాటి అవకాశాల్లోనే పూలమాలలు కట్టి అమ్ముతూ, బీ జాన్ బీ కుటుంబానికి ఆసరా ఇచ్చిన వైనం స్ఫూర్తిదాయకం. 'జీనేకే లియే హుషారీ హోనా బేటా' అన్న బీ జాన్ బీ మాటల్లో జీవితకాల అనుభవం మెరుస్తుంది. కుటుంబానికి బాసటైన ఆమె నిజంగానే 'అర్ధపురుష్'. ఇక భర్త ఎలా వున్నా సర్దుకుపోవాలన్న సగటు తండ్రి షరీఫ్. 'బతకాలంటే నన్ను నేను చంపుకోవాలా?' అని నిలదీసే జైనత్. ఈ రెండు విభిన్న పాత్రలు 'దిశ మార్చుకున్న గాలి' కథలో కనిపిస్తాయి. బానిస బతుకును వద్దనుకొని, కోర్టు మెట్లెక్కిన జైనత్‌ను మించిన పోరాటయోధురాలు ఎవరు? కోర్టుకెక్కితే పరువు వీధినపడుతుందనే భావన నుంచి ఒక ముస్లిం మహిళ బయటకు వచ్చి, ధైర్యంగా పరిస్థితులు ఎదుర్కోవడం మారుతున్న కాలానికి నిదర్శనం. అందుకే, 'ఇది మారుతున్న జమానాకు నిశాని. హవాకా రుఖ్ బదల్‌గయా'(ఇది మారుతున్న కాలానికి నిదర్శనం. గాలివాటం మారింది) అని జైనత్ సోదరి ముంతాజ్ చేసిన వ్యాఖ్యల్లో రచయిత్రి కనిపించడంలో చిత్రమేమీ లేదు. ఇలా చెప్పుకపోతే ప్రతి కథలోనూ ఒక కొత్త కోణం కనిపిస్తునే ఉంటుంది. 'దాస్తాన్'పై మరో పుస్తకమే రాయవచ్చు. సూక్ష్మంగా చెప్పాలంటే మాత్రం, 'పంఛీ ఔర్ పింజ్రా' (పక్షి మరియు పంజరం), నయాదౌర్ (కొత్త యుగం) కథల్లోనూ మహిళలు ఎదుర్కొంటున్న ఇతరత్రా సమస్యలను రచయిత్రి ప్రస్తావించారు. బాల్యం నుంచి భయానక వాతావరణంలో పెరిగిన ఒక బాలిక తల్లిగా ఎదిగినప్పటికీ, సమాజంతో మెలిగే తీరులోని మార్పును చూపించగలిగిన కథ 'ధూప్ ఛావ్' (ఎండ నీడ). ప్రపంచాన్ని గడగడలాడించిన మహమ్మారి కరోనా నేపథ్యంలో మారిన బతుకు చిత్రాల దర్పణమే 'కలల కల్లోలం', 'భరోసా' కథలు. మానసిక హింస అనేది శారీరక హింస కంటే ఏ మాత్రం తక్కువ కాదని, మనిషిని నిలువునా దహించివేస్తుందని తెలిపే కథ 'వియర్డ్'. తెలిసీతెలియని వయసులో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించిన కథ 'పాన్'. ఒక్క మాటలో చెప్పాలంటే, 'దాస్తాన్' లోని ప్రతి కథా చదివి తీరాల్సిందే. ముఖ్యంగా చీకటిలోనే మగ్గిపోతూ, ఎందుకు పుట్టామో, ఎందుకు బతుకుతున్నామో కూడా తెలియకుండా జీవచ్ఛవాల్లా మిగిలిపోతున్న ముస్లిం మహిళల బాధామయ పరిస్థితులు, పరిస్థితులకు వారు ఎదురుతిరుగుతున్న వైనం ఈ కథలు వివరిస్తాయి.

పుస్తకం పేరు: 'దాస్తాన్'
రచయిత్రి: నస్రీన్ ఖాన్
(అన్వీక్షికి పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ముద్రితం)

---

## సంభాషణల్లో స్థిరపడిన జాతీయాలు

సాహితీ పదనిసలు

జాతీయాలు అంటే ఒక జాతి ప్రజల సంభాషణలో స్థిరపడిపోయిన కొన్ని నానుడులు. సులభంగా అర్థమయ్యే మాటలు. మనిషి జీవితంలో కంటికి కనిపించేది, అనుభవంలోకి వచ్చేది, అనుభూతిని కలిగించేది ఇలా ప్రతి దాని నుంచి జాతీయాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. వేటూరి ప్రభాకర శాస్త్రి, నేదునూరి గంగాధరం, బూదరాజు రాధాకృష్ణ వంటి సంకలనకర్తలు అనేక జాతీయాలను అర్థ వివరణలతో సేకరించి ప్రచురించారు. ఆంగ్ల భాషలో 'జాతీయము' అనే పదానికి idiom అనే పదాన్ని వాడుతారు. జాతీయం అనేది జాతి వాడుకలో రూపుదిద్దుకొన్న భాషా విశేషం. ఒక జాతీయంలో ఉన్న పదాల అర్థాన్ని ఉన్నదున్నట్లు పరిశీలిస్తే వచ్చే అర్థం వేరు, ఆ పదాల పొందికతోనే వచ్చే జాతీయానికి ఉండే అర్థం వేరు. ఉదాహరణకు 'చేతికి ఎముక లేదు' అన్న జాతీయంలో ఉన్న పదాలకు విఘంటుపరంగా ఉండే అర్థం 'ఎముక లేని చేయి'. అనగా కేవలం కండరాలు మాత్రమే ఉండాలి. కాని ఈ జాతీయానికి అర్థం 'ధారాళంగా దానమిచ్చే మనిషి' అని. జాన్ సయీద్ అనే భాషావేత్త ప్రకారం, తరతరాల వాడుక వలన భాషలో కొన్ని పదాల వాడుక శిలావశేషంగా ఘనీభవించింది. కనుక భాషతో పరిచయం ఉన్నవారికే ఆ భాషలో ఉన్న జాతీయం అర్థమవుతుంది. 'నీళ్ళోసుకోవడం', 'అరికాలి మంట నెత్తికెక్కడం', 'దైలాగు పేలడం', 'తు.చ. తప్పకుండా', 'ఒళ్లు కాలిపోవడం', 'కడుపు రగిలిపోవడం' ఇలా.. ఎన్నో జాతీయాలు. ఇవి సంస్కృతికి అద్దం పట్టే భాషారూపాలు. సామాన్యంగా జాతీయాలను పని గట్టుకొని ఎవరూ పుట్టించరు. అలా పుట్టించినా అవి కలకాలం ప్రజల నోళ్ళలో వుండవు. జాతీయములు ఒక భాషలో సహజంగా పుట్టి ప్రజల నోళ్ళలో నానుతుంటా యి. తరతరాలుగా అలా వాడుకలో వుంటూనే వుంటాయి.




కొన్ని జాతీయాలను సామెతగాను, సామెతలను జాతీయంగాను పొరబడు సందర్భాలున్నాయి. నిజానికి ఈ రెండు వేరువేరు. సామెతలోని అర్థం సంపూర్ణం. ఉదాహరణ:సామెత...గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట...కాకిపిల్ల కాకికి ముద్దు.... తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం... ఇలా.. ఎన్నో ఉన్నాయి. వీటిలో అర్థం సంపూర్ణం. దాన్ని అన్వయించడంలో కొంత తేడా కనబడుతుంది. జాతీయాల్లో అర్థం అసంపూర్ణం. సగం వాక్యమే వుంటుంది. కడతేర్చాడు... కడుపు మంట.. అగ్గినిప్పు... పంటపండింది... పంటికిందరాయి... పక్కలోబల్లెం.. ఇలా, వుంటాయి. పైగా వాటి నిజార్థాలు వేరుగా వుంటాయి. మరొక అర్థంలో వాటిని వాడతారు. ఉదాహరణకు.... పంట పండింది. అనగా అతని వరిపంట పండిందని అర్థం కాదు. అతనొక గొప్ప విజయం సాధించాడని అర్థం. పప్పులో కాలేశాడు అంటే పప్పులో నిజంగా కాలేశాడని కాదు.. పొరబడ్డాడు అని అర్థం. ఇంతటి గూడార్థమున్న జాతీయాలు సామాన్య మానవులు, చదువులేని వారు సైతం అర్థం చేసుకుంటారు. వాడుతూనే ఉంటారు. కాబట్టి జాతీయాలను భాషకు ఆభరణాలు అని చెప్పవచ్చు.

---

## ఈ వారం కవితలు

### భవిత .. కవిత

శోభకృతకు వీడ్కోలు చెప్పక తప్పదు
క్రోధికి ధర్వాజ తీయక చెల్లదు
గ్యారంటీలతో వెతలకు స్వాగతం
పేరంటాలకు టి.యస్.ఆర్.టి.సి లోనే ప్రయాణం

ప్రకృతి మాత షడ్రుచుల పచ్చడి ప్రసాదిస్తుంది
ఆరోగ్యశ్రీ లను మనకు అండగా నిలుపుతుంది
కాలం తన ధర్మాన్ని నెరవేర్చనుంది
కలికాలం అవినీతితో అందలం ఎక్కనున్న ది

కవితా ఓ కవితా
నీకు లేదిక భద్రత
నవతా ఓ నవతా
సమత మమత నమ్రత నే కొరత

పెరిగిందిగా నాగరికత
కొరవడిందిలే సభ్యత
ముడుచుకున్నది మానవత
పురి విప్పింది అశ్లీలత

వేషభాషలదే ఘనత
తరుగుతున్నది సఖ్యత
మునిగి తేలుతున్నది నోట్లతో జనత
గంజాయి మత్తులో కులుకుతున్నది విజ్ఞత

ఆవరించింది జగతిన వ్యాకులత
అదుపు తప్పుతున్నది నడత
అలుముకున్నది నిశాచరిలా కలత
పథకాలతో సేదతీరమంటున్నది భవిత ప్రభుత

నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470 మేడ్చల్

### ఎండిన వరి నవ్వింది !

తాగు సాగునీరు
కరెంటు సబ్సిడీలు
గిట్టుబాటు ధర కై
ఖమ్మంలో రోడ్డెక్కిన
రైతులకు బేడీలు
వేసిన సంగతి
గుర్తులేదేమోసార్ కి ...?
మా పంట కొనే రైతు కేంద్రాలను
ఏర్పాటు చేయమని
రైతులు ఎక్కడికక్కడ
ధర్నాలు చేస్తున్నా
ర్యాలీలు తీస్తున్నా

రోడ్డున పడుతున్నా
ఆఖరికి ఆత్మహత్యలు
చేసుకుంటున్నా



ఏం చెయ్యమంటారు ...!
కరువు ప్రాంతంగా
ప్రకటించమంటారా..?
కాదు 'కల్లోలిత'
ప్రాంతంగా ప్రకటించండి
ఈ మాట సార్‌కి
ఆ రోజు రైతులు గుర్తు
రాలేదేమో ...?
ఎలక్షన్ల టైం కదా ..!
ఎండిపోయిన వరిపంట
దగ్గరికి సార్ మీరు వస్తే
ఎండిన వరి నవ్వింది... !!!

శోభ రమేష్
8978656327

### దొంగలు పడ్డారు

దొంగలు పడ్డారురోదేశమంతా నేడురా
దేశమంతా నేడురాదేశమేలెటోళ్లురా
ప్రజలగొంతు పైన గన్నుపేల్చుతున్న వాళ్లురా
ప్రజాస్వామ్య హక్కులన్నిపాతరేసెటోళ్లురా

అటు కేంద్రం ఇటు రాష్ట్రం అంతట వాళ్లేనురా
అందినంతా దిగమింగే అవినీతిగాళ్లురా
సంక్షేమం అభివృద్ధనిసోదిచెప్పెటోళ్లురా
స్కాములల్లో వేలకోట్లుస్వాహా చేసినోళ్లెరా
॥దొంగలు॥

వ్యాపారుల కార్పోరేట్లఅక్రమాల్లో వీళ్లురా
అన్నిట్లో భాగస్తులుఅంటకాగినోళ్లురా
ఎలెక్ట్రోల్ బాండ్లల్లోఎంతో దొబ్బినోళ్లురా
ఎరుగనట్లే పైకి నీతిఒలుకబోసెటోళ్లురా
॥దొంగలు॥

మతమంటూ విద్వేషంవిషం చిమ్మెటోళ్లురా
మనలో మనకు చిచ్చుపెట్టిమనల చీల్చెటోళ్లురా
మన లౌకిక విధానాన్నిమంటగలిపెటోళ్లురా
సంస్కృతి బహుళత్వాన్నిసావగొట్టెటోళ్లురా
॥దొంగలు॥

సర్కారు కంపెన్లనుసర్వమమ్మె వాళ్లురా
కార్పోరేట్ కంపిన్లకుకబ్జా చేసినారురా
కోట్ల కొలువులంటూ గొప్పఆశపెట్టినోళ్లురా
ఉన్నకొలువులూడబీకిఉరినిబెట్టినారురా
॥దొంగలు॥

ధరలమీద ధరలు పెంచిదగా చేసినోళ్లురా
అభివృద్ధి దేశప్రగతిఅసలు పట్టనోళ్లురా
అన్యాయం అన్నోళ్లనుఅణచివేసినారురా
దర్యాప్తులు కేసులతోదాడి చేసెటోళ్లురా
॥దొంగలు॥

మనల ముంచి మనల వంచిమనల దోచినోళ్లురా
మాయచేసి గెలిచేందుకుమళ్ల వచ్చినారురా
మర్మమెరిగి దొంగలను మట్టుబెట్ట ఓడించారా
ప్రజల పోరు పార్టీలనుపట్టుపట్టి గెలిపించరా
చట్టసభలో ప్రజావాణిసైరన్ వినిపించరా
॥దొంగలు॥

వేల్పుల నారాయణ
9440433475

### శిశిరమే లేకపోతే

ఔను
నేను ఉగాది వచ్చిందని
ఓ కవిత ముందేసుకున్నా!
కలం లో సిరా మాత్రమే పోసుకున్నా!

అక్షరాలు కోయిల చుట్టూ కాక
కాకి చుట్టే తిరుగుతున్నాయి
కాకుల ఐక్యతయే అక్షరాల ప్రేమకి హేతువు

కోయిల కంఠ మాధుర్యం కన్నా
కాకి అరుపే శ్రావ్యంగా వినిపిస్తుంది
కాకి అన్ని ఋతువుల్లో మనిషి వెన్నంటి

ఓ కాకి చనిపోతే కాకులన్నీ
కావ్ కావ్ మంటూ మూగుతాయి
మనిషి మాత్రం గోత్రం కులం మతమంటూ
తాత్సారం

మనుషులు మనుషులుగానే
బతుకుతున్నారా! అనే సందేహాన్ని
ఓ గొర్రె వెలిబుచ్చింది


పోకడకి గొర్రెను వాడుతున్నందుకు బాధపడుతూ
నేటి మనిషి పోకడ కు దానికి తేడా లేదని
నిర్ద్వందంగా తేల్చేసిన గొర్రె

వసంతం పైనే మక్కువ లేదంటూ కోయిల
కొబ్బరి ఆకుల మధ్య నుండి తుర్రున
ఎగిరిపోయింది
వేప చెట్టు మీది కాకి అరుస్తూనే వుంది
జన జాగృతం కోసం
శిశిరమే లేకపోతే వసంతమెక్కడిదని గ్రీష్మం
ప్రశ్నించగానే కలంలో సిరా అయిపోయింది!
కలం ఆగింది! నా బుర్ర స్తంభించింది!!

గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

### నవ్య తరం

గూగులమ్మ ఒడిలో నిద్రలు
వికిపీడియాలో మునకలు
స్మార్ట్‌ఫోన్‌తో సంసారాలు
ఆన్‌లైన్ తెరల్లో ఆటపాటలు
వాట్సప్‌లో వార్తల వరదలు
ఫేస్‌బుక్‌లో దూర్చే ముఖాలు
ఈమెయిల్‌లో సమాచారాలు
ఇన్‌స్టాలో ఇకమతుల ముచ్చట్లు
ట్విట్టర్‌లో పిట్టల కిచకిచలు
గూగుల్ లొకేషన్ మార్గదర్శకాలు
జూమ్ తెరలపై సమావేశాలు
వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలు
సెల్ఫీ ఫోటో ఫోజుల ఆర్భాటాలు
జొమాటో వడ్డించిన భోజనాలు
అమెజాన్ అంగడి సరుకులు



ఓటిటి వేదికల్లో చిత్రవిచిత్రాలు
యూట్యూబ్‌లో నీలి వీడియోలు
బయోమెట్రీ హాజరు సంతకాలు
క్షణాల్లో ఈ–నగదు బదిలీలు
కృత్రిమ మేధ నవ్య 'లీలలు'
అరచేతిలో చరవాణి శక్తులు
డిజిటల్ జిగేల్ యువతరాలు
వసుధైక కుటుంబ నిర్మాణాలు !

మధుపాళీ
9949700037

### ఎన్నికల పంచాంగం

ఇది ఎన్నికల ఉగాది
ఆకులూ పూలూ లేని చెట్ల కింద
పంచాంగ శ్రవణం జరుపుతున్నారు !
తెలుగు పండుగకి
ఆంగ్ల మంత్రాలు చదువుతున్నారు !
గంజాయి పచ్చడిని ఆరగింపచేయిస్తున్నారు !
ఉద్యోగాల భవిష్యత్ గురించి చెబుతూ
యుద్ధ విహారాలకి దారి చూపిస్తున్నారు

ఇది ఎన్నికల ఉగాది
ఓటర్ల కి
ఆకలి అవమానాలే మిగులుతున్నాయి !
రాజపూజ్యమంతా గుప్పెడు కుబేరులకే
సొంతమవుతుంది !

విక్రమార్కుడు భేతాలుని భుజం మీద మోస్తున్న ట్టు
రైతు నాగలిని మోస్తున్నాడు !

జెండాల కండువాలు
వాన గాలులు వీయడం లేదు
చలివేంద్రాల కుండలు నిండడం లేదు !
ఓటర్ల గుండెలు పచ్చడవుతున్నాయి
ఏడాది పొడుగునా !
వార్తలన్నీ
అసమాన, అవమాన, అనారోగ్య జీవితాల
గురించే !
పగలు పగలుగానే కనబడుతుంది
చీకటి మాత్రం ఒళ్ళంతా కమ్మేస్తుంది !
ఎన్నికల ఉగాది
ఓటర్ల ఊగాదిగా మారడం లేదు
కొత్త బట్టలు లేవు, కొత్త ఫలాలు లేవు !
కార్పొరేట్ కుబేరుల పంచాంగమే
వినిపిస్తున్నారు దేశంలో !

ఒబ్బిని,
9849558842

# ‘రైతుబంధు’పై రచ్చ.. రచ్చ

## జెడ్‌పి సమావేశంలో అధికార, విపక్ష సభ్యుల వాగ్వివాదం

### రాజకీయం చేయొద్దంటూ సభ్యులను సముదాయించిన చైర్మన్ బండా



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** రైతు బంధు విషయంలో జెడ్‌పి సమావేశంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఆదివారం నల్లగొండ జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో జెడ్‌పిచైర్మన్ బండా నరేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో జెడిఎ శ్రవణ్ సభ్యులకు వివరాలు చెబుతుండగా బిఆర్ఎస్ జడ్‌పిటిసి తిప్పన విజయసింహారెడ్డి రైతుబంధు వివరాలు అడగడంతో పాటు 3,4 ఎకరాల లోపు రైతులకే రైతు బంధు వేశారని, కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేశారు. వెంటనే జోక్యం చేసుకున్న జెడ్‌పి ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, కాంగ్రెస్ సభ్యులు ఎవిఎన్.రెడ్డి, వంగూరి లక్ష్మయ్యలు తిప్పన వ్యాఖ్యలు సరికావని ఖండించారు. ఈ విషయంలో కొద్ది సేపు సమావేశంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. కల్పించుకున్న జెడ్‌పి చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి రాజకీయాలు వద్దని, ప్రజాసమస్యలను చర్చించి పరిష్కరించాలే తప్ప రాజకీయాలు వద్దని చెప్పి ఇరువర్గాలను సద్దుమనిగేలా చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ సమీక్షలో రైతుబంధు పథకంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రవణ్ సమాధానం ఇచ్చారు. వేసవిలో ప్రజలకు తాగు నీటి సరఫరా, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం సేకరణ తదితర అంశాలపై చర్చించారు. మిర్యాలగూడ జెడ్‌పిటిసి మాట్లాడుతూ నాగార్జునసాగర్ నీరు ఖమ్మం జిల్లాకు పోతున్నాయని లెఫ్ట్ కెనాల్‌కు సంబంధించి నాలుగు నియోజకవర్గాలు ఉన్నా ఇక్కడ ప్రజలకు నీటి సమస్య ఉన్నా తూముల దగ్గర అధికారులను, పోలీసులను పెట్టి అక్కడికి తరలిస్తున్నారని ఇక్కడి రైతులకు ఆ నీరు అవసరం లేదా అని ప్రశ్నించారు. నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి లక్షల ఎకరాలు ఎండిపోయాయని ఈ మధ్య కుడి కాలువకు రెండుసార్లు నీరు ఇచ్చారని ఎడమ కాలువకు నీరు ఎందుకు ఇవ్వడం లేదో తెలపాలని ఈ విషయం ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకోవడం లేదన్నారు. నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ పర్యవేక్షక ఇంజనీర్ మాట్లాడుతూ పాలేరుకు సాగర్ నుండి వాటర్ సప్లై వెళ్లాలి కాబట్టి అక్కడికి అత్యవసరంగా మీరు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి నీరు విడుదల చేయడం జరిగిందని నాగార్జునసాగర్ డ్యాం పరిస్థితి బాగాలేదని అందులో మొత్తానికి నీరు లేదని నీకు సమస్య ఉందన్నారు. తిప్పర్తి జడ్పిటిసి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ పాశం రామ్ రెడ్డి మాట్లాడుతూ ఐకెపి సెంటర్ల నుండి ధాన్యం కొనుగోలు ప్రారంభించామని దాదాపు 70 అయిపోయిందని ఇంకా 30 ఉన్నా కూడా వాటికి తడి వదిలిపెట్టడం జరిగిందన్నారు. వేసవిలో జిల్లా ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగు నీరు సరఫరా చేయాలని జిల్లా పరిషత్తు సభ్యులు కోరారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు స్పందిస్తూ తాగునీటి విషయంలో ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో తాగు నీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని సరిపోనూ నీళ్లు ఉన్నాయని వివరించారు. సివిల్ సప్లై సమీక్షలో భాగంగా జిల్లావ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి నిర్ణయించామని ఈ యాసంగిలో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ప్రస్తుతం 250 కి పైగా సెంటర్లు ప్రారంభించి 12వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి పేమెంట్సు సైతం రాష్టంలో నల్గొండ జిల్లాలో ముందే చేస్తున్నామని సభ్యులకు తెలిపారు. వైద్యంపై సమీక్ష సందర్భంగా నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకునే జాగ్రత్తలకు సంబంధించి డిఎంహెచ్ఒ డాక్టర్ అన్నిమళ్ల కొండల్రావు సభ్యులకు తెలిపారు.

ఈ సందర్భంగా వడదెబ్బ తగలకుండా ఉండడానికి ఏం చేయాలి ఏం చేయకూడదనే అంశాలకు సం బంధించి జెడ్‌పిచైర్మన్ బండా నరేందర్ రెడ్డి, సిఇఒ ప్రేమ్ కరణ్ రెడ్డి, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలతో కలిసి వా ల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు 65 సంవత్సరాలు దాటిన పెద్దలు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని, వడదెబ్బకు గురికాకుండా జిల్లావ్యాప్తంగా ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని, స్థానిక సంస్థల సభ్యులు సైతం వడదెబ్బకు సంబంధించి గ్రామాలలో అవగాహన పెంచాలని కోరారు. సమావేశంలో డీఆర్డీఏ, విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యల పై చర్చించారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి డిప్యూటీ సిఇఒ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులతో పాటు, జెడ్‌పిటిసిలు, ఇతర సభ్యులు హాజరయ్యారు.

## సామాజిక చైతన్యంలో కళాకారులది కీలకపాత్ర :లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ :** సాంస్కృతిక పునరుజ్జీవం నుంచి మొదలుకుని నేటి సమాజం వరకు అనేక మార్పులకు కళా రంగమే దోహదపడిందని, వంద మాటలకన్నా ఒక పాట ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని ఎంఎల్‌ఎ బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కళావేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని ఐఎంఎ హాల్‌లో నిర్వహించిన సినీ స్వరాభిషేకానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాటలు ఒక సామాజిక మార్పునకే కాక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, పాట పాడడం అనేది ఒక గొప్ప వరంలా కళాకారులు భావించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, పొదిల శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ జలంధర్‌రెడ్డి, మర్రి ఎలియాస్, వెంకన్నగౌడ్, కార్యక్రమ నిర్వాహకులు శ్రీనివాసచారి, కందుకూరి సుదర్శన్, సత్యనారాయణచారి, ఏలే సత్యనారాయణ, సరస్వతి, మౌనిక, విద్యావంతుల వేదిక అంబటి నాగయ్య, సమూహ రైటర్స్ ఫోరం కస్తూరి ప్రభాకర్, కొండల్‌రెడ్డి, దాసరి రమణ, లక్ష్మ య్య, వంగాల సైదాచారి, సత్య పైళ్ల తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్ భాష మార్చుకోవాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** మాజీ మంత్రి కెటిఆర్ తన భాషను మార్చుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజనాయుడు విజ్ఞప్తి చేశారు.ఆదివారం పట్టణంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో కోల్పోయిన ఫ్రస్టేషన్‌లో మంత్రి కెటిఆర్ రాష్ట్ర సిఎంను గుంపు మేస్త్రీ అని, భారత ప్రధాన మంత్రిని తాపీ మేస్త్రీ అని సంబో ధించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు.రాజకీయాల్లో అభ్యంతరకర భాషను ఉపయోగించడం మొదలుపెట్టింది మాజీ సిఎం కెసిఆర్ అని, ఆయన రాజకీయ వారసుడిగా కెటిఆర్ కొనసాగిస్తున్నారని దానిని సభ్యసమాజం క్షమించదన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఒక్క స్థానం కూడా దక్కకుండా చేస్తారనే విషయాన్ని గమనించుకోవాలన్నారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు రావుల సత్యం, సిపిఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, సిపిఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస రెడ్డి, మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి ,ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొమ్రరాజు వెంకట్ పాల్గొన్నారు.

## సిపిఐ మండల కార్యవర్గ సమావేశం



**ప్రజాపక్షం/నాంపల్లి :** మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సూదనబోయిన రమేష్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాల్సిన కార్యకర్తలు ప్రలోభాలకు లోబడి సొంత అవసరాల కోసం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూదని తెలిపారు. పార్టీ పేరును వాడుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే సమాచారంతో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవ తీర్మాణం చేసి చిట్టెంపహాడ్ గ్రామానికి చెందిన గిరి స్వామి అనే వ్యక్తిని పార్టీ కార్యవర్గ బాధ్యతల నుండి తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు. సిపిఐ పార్టీ ప్రజలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు కృషి చేస్తుందని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ .అంజాచారి, సిపిఐ మండల కార్యదర్శి సుధనబోయిన రమేష్, సహాయ కార్యదర్శులు ఉరుపాక వెంకటయ్య, నేతాల రాజు, కార్యవర్గ సభ్యులు జనంపాట జగన్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించరా?

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి

**ప్రజాపక్షం/వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజు పల్లి గ్రామంలో 300 కుటుంబాల రెండు వాటర్ ప్లాంట్లు ఉండగా తక్కువ సామర్థ్యం గల వాటర్ ప్లాంట్‌ను పివి శ్యాంసుందర్‌రావు ఫౌండేషన్ నుండి పెట్టుకోవడం జరిగిందని గతంలో ఉన్న వాటర్ ప్లాంట్ మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి విరాళం నుండి వాటర్ ప్లాంట్ నిర్మించుకోవడం జరిగిందని తెలిపారు. వాటర్ ప్లాంట్ చెడిపోయి శిథిల అవస్థలో మూడు మాసాల నుండి ఉన్నది గ్రామ సర్పంచ్ల కాలపరిమితి అయిపోయిన తర్వాత గ్రామపంచాయతీలను పట్టించుకునే నాధుడే కరువయ్యాడు అన్నారు. వర్షాలు తక్కువ పడ డంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటి సమస్య పెద్ద సమస్యగా ఏర్పడిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి అన్నారు. దాతలు సహకారం లేక ఇబ్బందుల పాలవుతున్నారు. పంచాయతీ కార్యదర్శి మరియు స్పెషల్ ఆఫీసర్లు స్పందించి ప్రతిపాదనలు పంపాల ని కోరారు. స్థానిక ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో స్పందించి ప్రతిపాదనలు తీసు కొని నూతన వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం సహకరించాలని కోరారు.

## గుమ్లాపూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా కోస్నా తిరుపతిరెడ్డి



**ప్రజాపక్షం/చొప్పదండి :** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో రెడ్డి సంఘం ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. పోటాపోటీగా బ్యాలెట్ పద్ధతిన ఈ ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. అధ్యక్ష పదవికి ఇరువురు అభ్యర్థులైన రూపురెడ్డి అజయ్, కోస్నా తిరుపతిరెడ్డిలు పోటీ పడ్డారు. సంఘ సభ్యులందరూ ఓటు వినియోగించుకోగా రూపురెడ్డి అజయ్‌కు 17 ఓట్లు, కోస్నా తిరుపతిరెడ్డికి 56 ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో 39 ఓట్ల మెజార్టీతో కోస్నా తిరుపతిరెడ్డి అధ్యక్షునిగా ఎన్నికైనట్లు రెడ్డి సంఘం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కుర్మాచలం రత్నాకర్, సావనపెల్లి కృష్ణమాచారిలు తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఇనుకొండ రమణారెడ్డి, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెలుమ రఘుపతి రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎడవెల్లి రాజేందర్ రెడ్డి, కోశాధికారిగా రూపురెడ్డి హనుమంతరెడ్డిని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ముష్క వెంకట్ రెడ్డి, అప్పిడి శ్యాంసుందర్ రెడ్డి, వెల్మ బాపిరెడ్డి, గుజ్జుల జగన్ రెడ్డిలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా అల్లపు శ్రీనివాస్ రెడ్డి, రూపురెడ్డి మనోహర్ రెడ్డి, ఇనుమకొండ మనోజ్ రెడ్డి, అప్పిడి మధుసూధన్ రెడ్డిలను నియమించారు. ఈ సందర్బంగా నూతనంగా నియామకమైన రెడ్డి సంఘం అధ్యక్షుడు కూస్న తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన గెలుపుకు సహకరించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజలకు సేవకుడిలా.. పార్లమెంటులో ప్రశ్నించే గొంతుకనవుతా...

### కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** గత 2019 ఎన్నికల్లో ఎంపిగా ఓటమి చెందినప్పటికీ కరీంనగర్‌లోనే ఉంటూ ప్రజలకు సేవకుడిలా పనిచేస్తున్నానని.. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటున్నానని కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బండి సంజయ్ ఎంపిగా గెలిచి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని.. ఆ పార్టీ అభివృద్ధి కోసం పనిచేశాడు తప్ప ప్రజల కోసం పనిచేయడం లేదని పేర్కొన్నారు. కరీంనగర్ 9వ డివిజన్ కోతిరాంపూర్‌లోని కార్పొరేటర్ జంగిలి అయిలేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రముఖులు, ప్రజలతో సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావుతో కలిసి వినోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. 3 లక్షల జనాభా ఉన్న కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ చేయడం కష్టమని కేంద్ర పెద్దలు చెప్పినప్పటికీ పట్టుబట్టి అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు దగ్గరకు వెళ్లి వెయ్యి కోట్లతో కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ మంజూరు చేయించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. హైదరాబాద్ నగరంతో పోటీ పడే విధంగా కరీంనగర్‌ను అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలపడం జరిగిందని పేర్కొన్నారు. ఐదేళ్లు ఎంపిగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి నయాపైసా నిధులు తేలేదని, కరీంనగర్‌కు మంజూరైన ట్రిబుల్ ఐటి ఇతర రాష్ట్రాలకు బిజెపి కేంద్ర ప్రభుత్వం తరలిస్తుంటే బండి సంజయ్ చేతులు ముడుచుకుని ఉన్నారన్నారు. కరీంనగర్ ఎంపిగా 2014 నుంచి 2019 వరకు నేను ఉన్న సమయంలోనే రైల్వే లైన్ తీసుకురావడంతో పాటు, కరీంనగర్‌లో తిరుమల తిరుమతి దేవస్థానానికి రూ.25 కోట్ల నిధులు తీసుకువచ్చి ఆలయం నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ మళ్లీ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆశీర్వదించి పార్లమెంటుకు పంపిస్తే ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతునవుతానని పేర్కొన్నారు. అనంతరం కోతిరాంపూర్ పోచమ్మ ఆలయంలో కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గందె మహేష్, ప్రభావతి, కలర్ సత్తన్న, బండ వేణు, సహదేవ్ తదితరులున్నారు.


## భానుడి భగభగలతో నిర్మానుష్యంగా రోడ్డు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** భానుడి భగభగలతో ఆదివారం పోచంపల్లి పట్టణ ప్రధాన రోడ్డు ఇలా నిర్మాణస్యంగా దర్శనమిచ్చింది. మే నెల రాక ముందే ఏప్రిల్‌లోనే ఎండలు మండుతున్నాయి. పట్టణంలో 41 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం ఎండ తీవ్రత ఎంత ఉందో అంచనా వేయవచ్చు. ఉదయం నుండే వేడి తాపానికి భరించలేక ప్రజలు రోడ్ల మీదికి రావడానికి జంకుతున్నారు. ఉక్కపోతతో జనం ఇంటికే పరిమితమవుతున్నారు. విపరీతమైన ఎండ తాకిడికి ఇంట్లో ఉన్న వస్తువులు సైతం కొలిమిలో పెట్టినట్టుగా ఉంటున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతూ నిప్పుల కొలిమిగా మారుతోంది. ఒకవైపు ప్రచండ సూర్యరూపం మరోవైపు హిట్ వేవ్స్‌తో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పరిస్థితి దృష్ట్యా ఆరోగ్య నిపుణులు పిల్లలు, వృద్ధులు తప్పనిసరిగా బయటకి వెళ్ళినట్లయితే జాగ్రత్త లు పాటించాలని సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచనలు తప్పకుండా పాటించాలని హెచ్చరిస్తున్నారు.

## కార్యకర్తలు అధైర్య పడొద్దు

### మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత



**ప్రజాపక్షం/గుండాల :** బిఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆలేరు మాజీ ఎంఎల్ఎ, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునిత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నామమాత్రంగా ఏర్పాటు చేసి చేతులు దూలుపుకుందని, నేటికి ఏ ఒక్క కేంద్రంలో ఒక్క గింజ కూడా కొన్న పాపాన పోలేదని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చివరకు దళారుల పాలు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, బోనస్ అందజేయాలని, మద్దతు ధర కల్పించాలని, రుణమాఫి చేయాలని, నేటికి రైతు బంధు అందలేదని తక్షణమే వాటన్నింటిని అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు ఖలీల్, ఎంపిపి అమరావతి, ఎంపిటిసి సుశీల, మాజీ జెడ్‌పిటిసి రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్, నాయకులు బాల్‌రెడ్డి, ఉప్పలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఎ పదవికి తెల్లం రాజీనామా చేయాలి

### నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేశాడు

### ఎంఎల్ఎ వైఖరిపై న్యాయపోరాటం చేస్తాం

### విలేకరులతో ఎంఎల్‌సి తాతా మధు

**ప్రజాపక్షం/భద్రాచలం :** నమ్మి ఓటేసిన నియోజకవర్గ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన భద్రాచలం ఎంఎల్ఎ డా.తెల్లం వెంకట్రావు నీతి నిజాయితే ఉంటే శాసనసభ్యుని పదవికి రాజీనామా చేయాలని ఎంఎల్‌సి తాతా మధు అన్నారు. ఆదివారం స్థానిక రెడ్డి సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన వెంకట్రావుకు కెసిఆర్ నమ్మకంతో టిక్కెట్ ఇచ్చారని, తీరా కష్టపడి గెలిపించిన తర్వాత తన స్వార్థం కోసం కేవలం 115 రోజుల్లోనే పార్టీ మారడం నీతి మాలిన చర్య అన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను వేడుకుంటే దివంగత ఎంఎల్ఏలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్యలా మంచి పరిపాలన అందిస్తాడని ప్రజలు నమ్మి మోసపోయారని చెప్పారు. ఆయన గెలుపు కోసం తాను సైతం నాయకులను, కార్యకర్తలను ఏకం చేసి ప్రజల వద్దకు వెళ్లి గెలిపించేందుకు కృషి చేశానని, ప్రజలు తనను క్షమించాలని అన్నారు. వెంకట్రావుతో పాటు పార్టీ మారిన వారికి బిఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. తుక్కుగూడా సభ సాక్షిగా రాహుల్ గాంధీ పార్టీ మారిన వారిని నిషేధించేందుకు అధికారంలోనికి రాగానే చట్టం చేస్తాం చెప్పారని, ఆ మాటలు చెప్పి 24గం. కూడా గడవక ముందే వేరే పార్టీకి చెందిన వారిని ముఖ్యమంత్రి సమక్ష్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కండువా కప్పడం కాంగ్రెస్ దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. అగ్రనేతే సభ సాక్షిగా చెప్పి మాటతప్పితే... ఇంక ప్రజలను ఏ మేరకు పరిపాలిస్తారని ఎద్దేవా చేశారు. ఎంఎల్ఏల ఫిరాయింపుల చట్టం హైకోర్టు తీర్పును అనుసరించి సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు.

వారం రోజుల్లో నియోజకవర్గ బిఆర్ఎస్ కోఆర్డినేషన్ కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాను న్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపుకు అం తా కలిసి కట్టుగా పనిచేస్తారన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంకట్రావు నీతి మాలిన చర్యలను ఎండగడతామని, ఓటు కోసం వస్తే ప్రజలు ఛీ కొట్టి వెనక్కు పంపాలని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, తాండ్ర రమణారావు, ఆకోజ్ సునీల్ కుమార్, కోలా రాజు, ప్రభోద్ కుమార్, విశ్వనాథ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకుడు మునిగె అచ్చయ్య మృతి

### నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని అమ్మపాలెం గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకులు మునిగె అచ్చయ్య (75) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ జిల్లా నాయకులు యర్రాబాబుతో కలిసి అచ్చయ్య మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతు అచ్చయ్య పేద ప్రజలు, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం పనిచేశారని అన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ చీలిన తర్వాత అమ్మపాలెం గ్రామంలో జరిగిన ఖమ్మం తాలూకా మహాసభలో యువకుడిగా పాల్గొని కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు ఎంతో కృషిచేశాడని కొనియాడారు. అచ్చయ్య మృతి కుటుంబానికి పార్టీకి తీరని లోటని అ న్నారు. అచ్చయ్య కుమారుడు మునిగె కోటేశ్వరరావు కూడా తండ్రి వారసత్వంగా సిపిఐ లోనే కొనసాగుతు ప్రస్తుతం అమ్మపాలెం సిపిఐ గ్రా మశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ వెంప టి పరుశురాములు , మాజీ ఎంపిటిసి గునగం టి వెంకట లక్ష్మీ నారాయణ , సిపిఎం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ , దారగాని రాములు , ఖాదర్‌బాబు , సిపిఐ మండల కార్యదర్శి వేములకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు వ్యక్తి మృతి

### సిపిఐ నేతలు నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వడదెబ్బకు వ్యక్తి మృతిచెందిన ఘటన ఖమ్మం రూరల్ మండలం ముత్యాలగూడెంలో చోటు చేసుకుంది. చిన్నబాబు (58) అనే వ్యక్తి మేక లు కాసేందుకు వెళ్లి వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కు మారులు ఉన్నారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ జిల్లా కార్యదర్శి పో టు ప్రసాద్, జిల్లా నాయకులు పుచ్చకాయల కమలాకర్, చిన్నబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ వడదెబ్బతో మృతి చెందిన చిన్నబాబు కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. నివాళులర్పించిన వారిలో మేదరమెట్ల వెంకటరామనర్సయ్య, పలువురు గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పేదల గొంతుక ఎండి. జహంగీర్

### చెరుపల్లి సీతారాములు



**ప్రజాపక్షం/ రామన్నపేట :** నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడే సిపిఐ (ఎం) అభ్యర్థి ఎండి. జహంగీర్‌ను భువనగిరి ఎంపిగా గెలిపించి పేదల గొంతుకను పార్లమెంట్‌కు పంపాలని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అ న్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ముఖ్యకా ర్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబో యే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీలో ఉన్నారని, అలాగే సిపిఎం నుంచి ఎండి. జహంగీర్ పోటీ చేస్తున్నాడని అన్నారు. గత పాలకు ల పుణ్యమా అని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉందని అన్నా రు. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గడంతో బిజెపి కార్పొరేట్ శక్తులు గత పది సంవత్సరాల కాలం నుంచి ప్రజావేదిక బిల్లులను తీసుకొచ్చి పార్లమెంట్‌లో ఆమోదింప చేసుకుంటున్నారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాదంలో పడిందని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైన ఉందన్నారు. భారత రాజ్యాంగా న్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఎర్రజెండాలు ప్రాతినిధ్యం పార్లమెంట్‌లో ఉండాలన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి ఎంతోమంది అమరవీరులు తమ ప్రాణాలను ప్రజల కోసం త్యాగం చేసి పేదలకు పది లక్షల ఎకరాలను పంచిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్ వెస్లీ, సిపిఐ(ఎం) అభ్యర్థి ఎండి. జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్‌రెడ్డి, కల్లూరి మల్లేశం, జగదీష్, ఆనగంటి వెంకటేష్, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, ఎంపిపి నాగటి ఉపేందర్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీకంగా వాడుకుని మోసం చేశాడని ఆరోపిస్తూ ఆదివారం ఓ యువతి అతని ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన పట్టణంలోని బొడ్రాయి బజార్‌లో చోటుచేసుకుంది. బాధిత యువతి తెలిపిన వివరాల ప్రకారం చివ్వెంల మండలం కోటినాయక్ తండాకు చెంది న తను జిల్లా కేంద్రంలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న తనకు అదే కళాశాలలో చదువుతున్న జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్‌కు చెందిన అనంతుల మహేష్ అనే యువకుడు వెంటపడి ప్రేమించానని నమ్మబలుకుతూ వెంట తిరిగి పెళ్లి చేసుకుంటాననంటూ శారీరకం గా కూడా వాడుకుని నేడు పెళ్లి చేసుకోమని కోరగా అందు కు నిరాకరించాలని తెలిపారు. తన తల్లిదండ్రులు పెళ్లి ఒ ప్పుకోవడం లేదని నీవు తక్కువ కులానికి చెందిన దానివని నానా మాటలు చెప్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తనను వివాహం చేసుకుంటానని అనంతుల మహేష్ తమ ఇంటికి వచ్చి మా తల్లిదండ్రులతో మాట్లాడాడని ఇప్పుడు తమ ఇంట్లో పెళ్లికి ఒప్పుకోవడం లేదని వివాహం చేసుకోనని చెప్పి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆమె ఆరోపించారు. దీంతో సూర్యాపేట షీటీం పోలీసులకు గత పదిరోజుల క్రితం ఫిర్యాదు చేయగా పట్టించుకోకపోవడంతో మహేష్ ఇంటి ఎదుట ధర్నాకు దిగినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికైనా మ హేష్‌తో వివాహం జరిపించి తనకు న్యాయం చేయాలని కో రారు. అబ్బాయితో నాకు వివాహం జరగకపోతే చావుకైనా వెనకాడనని తెగేసి చెప్పింది. అబ్బాయి ఇంటి ముందు ధర్నా విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చే యాలని సూచించడంతో ధర్నా విరమించి అనంతుల మహేష్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యా దు చేయగా పట్టణ సిపిఐ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

## మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

### మెదక్ ఎంపి అభ్యర్థి నీలం మధుతో సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** తుక్కుగూడలో జరిగిన జనజాతర సభ సక్సెస్ లో కలిసికట్టుగా ముందుకు కదిలి మెదక్ పార్లమెంటు తరపున జన సమీకరణ చేసి విజయవంతం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్ లోని సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ విజయవంతానికి కలిసి పనిచేసిన నీలం మధును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. సభను విజయవంతం చేసిన స్ఫూర్తితో ప్రజలలోకి వెళ్లాలని సూచించారు. అందరి నాయకులతో ఐక్యంగా కలిసి ముందుకు వెళ్లి , పక్క ప్రణాళికతో ముందుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ రాగానే కరువు ఎందుకు వచ్చింది? కరంట్ ఎందుకు పోతుంది?

### బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి




**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** బిఆర్ఎస్ పాలనలో 9 ఏండ్లుగా పోని కరెంట్.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎందుకు పోతుందని బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి, ఎంఎల్‌సి వెంకట్రామ్‌రెడ్డి ప్రజలు ఆలోచించాలన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం సిద్దన్నపేటలో జరిగిన బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ రావటంతోనే కరువు వచ్చిందని.. కరెంట్ పోతుందని విమర్శించారు. కెసిఆర్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కలెక్టర్‌గా ఖ్యాతి తెచ్చిన గడ్డనే నాకు రాజకీయ జీవితం ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. తాను ఇక్కడ జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌గా పని చేసి ప్రజల మన్ననలు పొందినట్లు తెలిపారు. పార్లమెంట్ సభ్యుడిగా అడుగుపెట్టే అవకశం ఇక్కడనుండి లభిస్తుండటం తన అదృష్టమన్నారు. పరిపాలన అనుభవంతో మీ సమస్యల పరిష్కారం కోసం సులువు అవుతుందున్నారు. నాకు డబ్బు మీద యావ లేదని, పేద ప్రజల సేవపైన దృష్టి ఉందన్నారు. తాను సేవ చేసిన తర్వాత కూడ 50 ఏళ్లు పేరు నిలిచి ఉండేలా అన్నదే తనధ్యేయమన్నారు. 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి మీకు అండగా ఉంటానన్నారు. నియోజ కవర్గంలో పేదలకు విద్యాభివృద్ధికి, నిరుద్యోగులకు ఉద్యోగ శిక్షణ కల్పించి ఉపాధి, ఉద్యోగ కల్పనకు వినియోగిస్తానన్నారు. తనను మెదక నియోజక వర్గం నుండి అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ చైర్మన్ సారయ్య, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, ఎడ్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడవికి అంటుకున్న కార్చిచ్చు



**ప్రజాపక్షం/ఏటూరునాగారం :** ములుగు జిల్లాలోని తాడ్వాయి ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో కార్చిచ్చురగులుకుంది. ఆదివారం ఉదయం సంభవించిన అగ్ని ప్రమాదంలో అటవీ ప్రాంతం దగ్ధమవుతుంది. అటుగా వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తులు విసిరిన అగ్గివల్ల ఏటురునాగారం అభయారణ్యంలో గత వారం రోజులుగా అడవి అంటుకొని వందలాది రకాల చెట్లు అగ్గివల్ల బుగ్గి అవుతున్నాయి. తమకు ప్రాణదారమైన అడవి అగ్నిప్రమాదం కారణంగా దహనం అవుతుండడంతో అడవిలో జీవించే వన్యప్రాణులుప్రాణ భయంతో దిక్కు తోచని స్థితిలో పరుగులు తీస్తూ సమీప గ్రామాల వైపు పరుగులు పెడుతున్నట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. భారీగా పొగ మేఘాలు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు.

## ఎన్నికల దృష్ట్యా పోలీస్ కవాతు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పార్లమెంట్ ఎన్నికల్లో శాంతి భద్రతల దృష్ట్యా గ్రామాలలో పోలీస్ కవాత్ నిర్వహిస్తున్నామని స్థానిక ఎస్సై నరేష్ వెల్లడించారు. అదివారం మండల పరిధిలోని చికోడ్, కొత్త లింగయ్య పల్లి, మల్లంపేట, డాక్య తండా గ్రామాల్లో 45 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నచ్చిన వ్యక్తికి ధైర్యంగా ఓటు వేసే స్వేచ్ఛను కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరి వెంట పాపన్నపేట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## డిగ్రీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఇటీవల జరిగిన డిగ్రీ పరీక్షలలో ఫెయిల్ అయిందన్న కారణంతో మనస్తాపం చెందిన విద్యార్థిని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన మాశ పరమేష్ కుమార్తె సోని (20) డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతుంది. పరీక్షలలో ఫెయిల్ అయ్యానన్న మనస్థాపంతో ఆమె ఆదివారం ఉదయం నిడిగొండ బ్రిడ్జివద్ద గుర్తు తెలియని ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే అధికారుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న జనగామ జీఆర్పీ పోలీసులు మృతురాలి వద్ద లభించిన ఆధార్‌కార్డ్ ఆధారంగా ఆమెను గుర్తించారు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన పోలీసులు మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

## డిజెల ఏర్పాటుకు అనుమతులు లేవు

### ఎసిపి కొత్త దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, డిజెలకు ఎలాంటి అనుమతులు లేవని హన్మకొండ ఎసిపి కొత్త దేవేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎసిపి కొత్త దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అర్ధరాత్రి సమయాల్లో పెళ్లి ఊరేగింపు వేళ డీజేలు ఏర్పాటుచేయడం ద్వారా డీజేలకు అనుమతులు లేవు. డీజే వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, డిజెలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి సమయాల్లో పెళ్లి ఊరేగింపు వేళ డిజెలు వినియోగచడం వల్ల అధిక శబ్దాలు వస్తుండటంతో హృద్రోగులు, వృద్ధులకు ఆరోగ్య సమస్య ఉత్పన్నం కావడంతో పాటు పరీక్షల వేళ విద్యార్థులకు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజల ఫిర్యాదులు రావడంతో వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా సూచనల మేరకు డిజెల వినియోగంపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇకపై నగరంలో డిజెల ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. డిజెలు ఏర్పాటు చేస్తే డిజెను సీజ్ చేయడంతోపాటు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

### ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని భూపాలపల్లి ఎంఎల్‌ఎ గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం సోదరులు రంజాన్ పండగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎంఎల్‌ఎ గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ముస్లింల మత సంప్రదాయంతో మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల దైవం అల్లా దయవల్ల నియోజకవర్గంలోని ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందని, ముస్లింల మసీదులు కబరాస్తాన్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి అభివృద్ధి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోని ముస్లిం మైనార్టీల అభివృద్ధి జరిగిందని ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎన్ ఆర్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామ్ నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ నాయకులు పిప్పాల రాజేందర్, భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు అప్పం కిషన్, బుర్ర కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం స్వాధీనం



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్‌లో అక్రమంగా నిల్వ చేసిన పిడిఎస్ బియ్యం నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 17.50 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధ రాత్రి నమ్మదగిన సమాచారం మేరకు జగదేవ్‌పూర్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వాల్లాల వెంకటేశం, లక్ష్మి నర్సయ్య, బుద్దరాములు అక్రమంగా నిల్వచేసిన పిడిఎస్ బియ్యం నిల్వ చేసిన గోదాంలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలపారు. పౌరసరఫరాల అధికారుల విచారణ అనంతరం నింధుతులపై కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుడిసెలను తొలగించడం అమానుషం



**ప్రజాపక్షం/ వరంగల్ :** నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గత రెండేళ్ల క్రితం గుడిసెలు వేసుకోని నివాసం ఉంటున్నారని, రాత్రికి రాత్రే గుడిసెలను తొలగించిన అమానుషం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్ అన్నారు. వరంగల్‌లోని స్టాలిన్ నగర్ సిపిఎం ఆధ్వర్యంలో వేసిన గుడిసెలను తొలగించడంతో రాష్ట్ర బృంధం ఆదివారం పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిలో గత రెండు సంవత్సారాల క్రితం 1560 కుటుంబాలు గుడిసెలు వేసుకోని నివాసం ఉంటున్నారని, శనివారం తెల్లవారుజామున 2.30గంటలకు ప్రభుత్వ అధికారులు, పోలీసులు, ఇతర సిబ్బందితో వచ్చి జెసిబి, డోజర్లతో దాడిచేసి అర్ధరాత్రి నిద్రలో ఉన్న పేద ప్రజల గుడిసెలను నేల మట్టం చేయడం దుర్మార్గ చర్య అన్నారు. తొలగించిన ప్రభుత్వ భూమిలోనే గుడిసెలు ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని, రూ. 5లక్షల రూపాయల ఆర్థిక సహయం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి, కమిటి సభ్యులు తప్పెట్ల స్కైలాబ్ బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కాసు మాధవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, కోరే కుమారస్వామి, సాగర్, నమిండ్ల స్వామి, హన్మకొండ శ్రీధర్, ఆరూరి కుమార్, ఎండి బషీర్, దుర్గయ్య, సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కృషి

### ఎంఎల్ఎ యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పాలకుర్తి నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎంఎల్ఎ యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టి నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి కృషి చేస్తాయన్నారు. హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలుగుతారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు ఎండీ సలీం, ఎండీ నజీర్, ఎండీ యాకూబ్, సలాం, అబ్బాస్, అలీ, ఎండీ వహీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, నాయకులు నిరంజన్‌రెడ్డి, రాఘవరావు, జలగం కుమార్, పోగు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, భార్గవ్, హరీష్, ఆదినారాయణ, యాక సోమయ్య, ఎం యాకయ్య, ఆంజనేయులు, చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు త్యాగం మరువ లేనిది

### సిపిఐ రాష్ట కమిటీ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్




**ప్రజాపక్షం/గార్ల :** ప్రజా ఉద్యమాలతో, సేవలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న భారత కమ్యూనిస్టు ముద్దుబిడ్డ కామ్రేడ్ కట్టెబోయిన వెంకటేశ్వర్లులని, సిపిఐ పార్టినీ బలోపేతానికి చేయడమే మనం వెంకటేశ్వర్లుకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఐ రాష్ట కమిటి సభ్యుడు మండల వైస్ ఎంపిపి కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు. కట్టెబోయిన వెంటేశ్వర్లు వర్ధంతి సందర్బంగా శనివారం మద్దివంచ గ్రామంలో శనివారం సిపిఐ మండల, మద్దివంచ గ్రామ శాఖ ఆధ్వర్యంలో శనివారం కట్టెబోయిన వెంకటేశ్వర్లు స్మారక స్తూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న జెండా ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వైస్ ఎంపిపి కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి కొరకు ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలిపెట్టి తన ఆరోగ్యం సహకరించక పోయినా ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతరం ఉద్యమించిన సిపిఐ నేత వెంకటేశ్వర్లు అని అన్నారు. పేదలకు పక్కా ఇండ్లు నిర్మాణం కొరకు ఉద్యమించి సాదించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. రానున్న రోజుల్లో పార్టీని అభివృద్ధికి పార్టీ శ్రేణులు కృషి చేయడమే ఆయనకు మనం ఇచ్చే అసలైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్, గ్రామ శాఖ కార్యదర్శి దూపాటి జనార్దన్, రాగం పుల్లయ్య, రాగం సత్యం, మాగం రంగయ్య,రాము, ఉపెందర్, గుగులోత్ సక్కు, చిటాకుల రాములు, పిచ్చయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, పురుశోత్తం, ప్రవీణ్, బాబు, రమేష్ తదితరులు పాల్గోన్నారు.

## పసుపుమయమైన మల్లన్న ఆలయం



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్దదైన జాతరగా శ్రీ ఐ నవోలు మల్లికార్జున స్వామి జాతరగా పిలుస్తారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభమయ్య జాతర ఉగాది వరకు మూడు నెలలు కొనసాగుతుంది. ఈ జాతరకు దేశం నలమూరు నుండి హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కలు చెల్లించుకుంటారు. కోరిన వారికి కొంగుబంగారం చేసే మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న ప్రతిభక్తులు కోరిన కోరికలు కొలుస్తారు. బ్రహ్మోత్సవాలలో చివరి ఆది వారం 30 మంది ఒగ్గుపూజారులు 7 గంటలు శ్రమించి (50 ఫీట్స్అడ్డం 50 ఫీట్స్ నిలువు విస్తీర్ణంలో) మహా పెద్దపట్నం వేయడం జరిగినది, గొల్ల కేతమ్మ, బలిజ మేడాలమ్మ , మల్లికార్జున స్వామి వారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగినది. అనంతరం దేవాలయ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు, మాట్లాడుతూ పెద్ద పట్నం కోసం వేలాదిగా భక్తులు తరలి వస్తారని ముందుగానే ఊహించి భక్తులకు కావలసిన సకల సౌకర్యాలు అందుబాటులో ఉంచడం జరిగింది అన్నారు. పెద్దపట్నం కోసం దేశం నలుమూలల నుండి భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, ఒగ్గు పూజారులు మజ్జిగ మహేందర్ మజ్జిగ మల్లయ్య, మజ్జిగ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల రిజర్వేషన్‌పై మద్దతు



**ప్రజాపక్షం/నర్సంపేట :** తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీ మేరకు ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే ముదిరాజ్‌లను బిసిడి నుండి బిసి ఎలోకి మార్చాలని, అందుకుగాను రాష్ట్రంలో అన్ని బిసి కులాల మద్దతు ఇవ్వాలని మెపా తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. ఆదివారం జాతీయ బిసి సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యను ఆయన నివాసం కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈసందర్బంగా దేవేందర్ మాట్లాడుతూ టిఎస్‌పిఎస్‌సి ఉద్యోగ నోటిఫికేషన్స్ ప్రక్రియలను ప్రారంభం చేయడానికి సన్నాహాలు చేస్తున్నదని, కావున దానిని దృష్టిలో పెట్టుకోని ప్రభుత్వం ఈ రిజర్వేషన్ ప్రక్రియనరు ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే ప్రారంభించాలన్నారు. అందు కోసం అన్ని బిసి కుల సంఘాలు కూడా ముదిరాజ్‌ల ఆర్థిక జీవన పరిస్థితులు దృష్టిలో ఉంచుకోని మద్దతు ఇచ్చి సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో బిసి సంఘం జాతీయ కార్యదర్శి పగిడాల సుధాకర్, మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్ కుమార్, గౌరవాధ్యక్షులు జగన్మోహన్, శివ, పెండ్యాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

### మాజీ ఎంపి సీతారాంనాయక్



**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని మాజీ ఎంపి అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని పస్రా గ్రామంలో కొండ్రెడ్డి చెన్నారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బిజెపి మండలాధ్యక్షుడు మద్దినేని తేజ రాజు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీతారాంనాయక్ హాజరై మాట్లాడారు. వెంకటాపురం మండలంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఒకప్పుడు మావోయిస్టులు ప్రగతి భవన్‌ను పేల్చివేసి నిబద్ధతను చాటుకోవాలని మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై ఎందుకు నోరు మెదపడం లేదని అన్నారు. నిజమైన ఎన్‌కౌంటర్ ఆ బూటకపు ఎన్‌కౌంటర్ అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే ప్రజలకు ఎలా తెలుస్తుందని అన్నారు. ప్రభుత్వంపై స్పష్టమైన సమాధానం లేకపోవడం ప్రభుత్వం అసమర్థ పాలనకు అద్దం పడుతుందని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపించి ఆర్థిక అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా ఇన్‌చార్జి నరోత్తంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, ప్రచార కన్వీనర్ రుద్రారం సురేష్, పార్లమెంట్ కోకన్వీనర్ తక్కెళ్ళపల్లి దేవేందర్‌రావు, బిజెపి సీనియర్ నాయకులు జాడి వెంకట్ కర్ర సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో బినామీ పేర్లతో టెండర్లు!

### దొంగ బిల్లులతో లక్షలు కాజేస్తున్న అధికారులు



**ప్రజాపక్షం/ఏటూరునాగారం :** మేడారం సమ్మక్క సారక్క మహా జాతరలో ఐటిడిఎ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా అవినీతి అక్రమాలకు తెరా లేపారు. అధికారులు దగ్గర ఉండి బినామీలను ఏర్పాటు చేసుకొని టెండర్లు వేసి దొంగ బిల్లు పెట్టి లక్షలలో దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మేడారం జాతరకు విధులు నిర్వహించడం కోసం వచ్చే వివిధ శాఖల అధికారులకు 5రోజుల పాటు వారికీ ఐటిడిఎ ద్వారా భోజనం సౌకర్యం ఏర్పాటు చేస్తారు. కూరగాయలు సప్లై చేయడానికి మహిళకు టెండర్ అప్పగించారు. కూరగాయలు సప్లై చేయడానికి మూడు నుంచి నాలుగు లక్షల వరకు ఖర్చు చేసినట్లు పలువురు అధికారులు అంచనా వేస్తున్నారు. కొందరు ఐటిడిఎ అధికారులే బినామీలతో చాలా పనులు చేపట్టినట్లు విమర్శలు ఉన్నాయి. ఏకంగా మేడారం జాతరకు కూరగాయలు సప్లై చేయడానికి 12 లక్షల వరకు ఖర్చు చేసినట్లు దొంగ బిల్లులు పెట్టి నిధులు కాజేసినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కూరగాయలు సప్లై చేయడంలో కొంతమంది ఐటిడిఎ అధికారుల కనుసన్నాల్లో ఉండే వ్యక్తులు దగ్గరుండి మరీ కూరగాయలు సప్లై చేశారు. మేడారం, తాడువాయి, ప్రాజెక్టునగర్, ఆశ్రమ పాఠశాల కు చెందిన వార్డెన్ల, సిబ్బంది పేర్లమీద, బిల్లులు పెట్టించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. మేడారం అభివృద్ధి పనులలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు ప్రతి దానిలో ఐటిడిఎ అధికారుల పాత్ర ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగం సమగ్ర విచారణ జరిపించి మేడారం అక్రమ దందా బినామీలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### మాజీ ఎంఎల్ఎ అరూరి రమేష్




**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** భారతదేశానికి ఆదర్శప్రాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని వర్ధన్నపేట మాజీ ఎంఎల్ఎ ఆరూరి రమేష్ అన్నారు. ఆదివారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని లక్ష్మీ గడ్డంలో బిజెపి పార్టీ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశ సదస్సు నిర్వహించగా బిజెపి పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ భారత్‌కు నరేంద్రమోడీ శ్రీరామరక్షగా ఉన్నాడని గుర్తు చేశారు. మోడీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారాణి తెలిపారు. ప్రపంచమేత్తం భారత్ వైపు చూసేలా చేస్తున్న ఘనత నరేంద్రమోడీదేనన్నారు. దేశాన్ని లూటీ చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు దేశం నుంచి తరిమికొట్టబోతున్నారాణి గుర్తు చేశారు. యమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కూటమిలకు ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. బిజెపి పార్టీ కార్యకర్త లు సైన్యంలా పనిచేయాలనారు. పదేళ్ల మోడీ పాలన ఫలాలను మారుమూల పల్లెలకూ చేరవేయాలనీ కార్యకర్తలకు గుర్తు చేశారు. వరంగల్ పార్లమెంటును మోడీకి బహుమతిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట, ఐనవోలు, పర్వతగిరి, మండల స్థాయి నాయకులు పార్లమెంట్ ప్రభారి మురళీధర్ గౌడ్, రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు గంట రవి, రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, అసెంబ్లీ కన్వీనర్ కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బి ఆర్గానిక్స్ బాధితులకు అండగా ఉంటా : ఎంఎల్ఎ సునీత రెడ్డి



**ప్రజాపక్షం/హత్నూర :** చందాపూర్ ఎస్‌బి ఆర్గానిక్స్ పరిశ్రమ రియాక్టర్ పేలిన ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎంఎల్ఎ సునీత రెడ్డి ఆదివారం పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. హత్నూర మండలంలోని కొన్యాల గ్రామానికి చెందినవడ్డేపల్లి రమేష్, చందాపూర్‌కు చెందిన చాకలి విష్ణులు మృతి చెందగా వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఏ విషయమైనా తనని ప్రత్యక్షంగా సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వావిలాల నర్సింలు, బిఆర్ఎస్ నాయకులు దేవేందర్ రెడ్డి, కాసాల పిఎసిఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ కిషోర్, మాయిని శ్రీకాంత్, గమ్యం సురేందర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/కొండపాక:** కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకటించిన విధంగా హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, అధికారంలోకి రావడానికి అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కరువును తీసుకొచ్చిందని మాజీ ఎఫ్డిసి చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని దుద్దెడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోని వైష్ణవి గార్డెన్‌లో ఈ నెల 11వ తేదీన మండల స్థాయి నేతలు కార్యకర్తలతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సిద్దిపేట ఎంఎల్ఎ హరీష్‌రావు, బిఆర్ఎస్ మెదక్ ఎంపి అభ్యర్థి వెంకట్రామిరెడ్డిలు బిఆర్ఎస్ పార్టీ నేతలు హాజరవుతారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజును చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపరించిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్ధానాలను కప్పిపుచ్చుకోవడానికి ఫోన్ ట్యాపింగ్ కేసుల రూపంలో ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఎండగట్టాలంటే వెంకటరామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ రైబాస మండల కోఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, బారాస మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, పెద్దంకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ ఆర్‌టిసి డిఎం విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ ప్రతినిధి :** ప్రయాణికుల నుంచి అధిక బస్ చార్జీలు వసూలు చేస్తున్న కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్ ఆర్‌టిసి డిఎం విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం రెబ్బెనలో ఏర్పాటు చేసిన విలేకరుల తో ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ డిపోలో పల్లె వెలుగు బస్సులను ఉపయోగిస్తూ ఎక్స్‌ప్రెస్ బస్‌చార్జీలు వసూలు చేస్తున్నారని, ఈ విషయంపై ఎఐటియుసి ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి ఎండి సజ్జనారుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం /జైనూర్ :** తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఆదివారం మండల బిఆర్ఎస్ నాయకులు భారీ ఎత్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో జైనూర్ మండల కోఆప్షన్ సభ్యుడు ఫెరోజ్ ఖాన్, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శేక్ రషీద్, నాయకులు మరుసుకోల సుదర్శన్, షేక్ షకీల్, మోహియోద్దీన్, బుతాలే కిరణ్, మార్చుకోలా దేవా, సయ్యద్ అలిమొద్దిన్, సయ్యద్ సాబిర్‌లు కాంగ్రెస్‌లో చేరగా వారికి మంత్రి సీతక్క పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, ఆదిలాబాద్ ఎంపి అభ్యర్థి సుగుణక్క, నియోజక వర్గ ఇంచార్జ్ శ్యామ్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ముఖీద్‌లు ఉన్నారు.

## కన్నాల ఆలయంలో మంత్రి పూజలు



**ప్రజాపక్షం/మంథని :** మంథని మండలం కన్నాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని రాష్ట్ర ఐటీ పరిశ్రమలశాఖమంత్రి శ్రీధర్‌బాబు దర్శించుకున్నారు.ఆదివారం కన్నాల ఆలయంలోని స్వామివారినిదర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు సుఖ సంతోషాలు,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మంత్రికి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమా సురేష్‌రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు చిదురాల దామోదర్‌రెడ్డి, ముస్కుల సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పొయిల రాజయ్య, తోకల మల్లేష్, కావటి భూమయ్య, పర్వతాలు యాదవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశం కొరకు ఆదివారం 6వ తరగతికి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7నుంచి 10వ తరగతులలో మిగులు సీట్లకు మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు జిల్లాలో 10 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ, అధికారి ఎస్ యాదయ్య తెలిపారు. ఉదయం ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు 10 పరీక్షా కేంద్రాలలో 1358 మంది విద్యార్థులకు గాను 1135 మంది విద్యార్థులు హాజరయ్యారని, మధ్యాహ్నం 09 పరీక్షా కేంద్రాలలో ఏడవ తరగతికి 511 మంది విద్యార్థులకు గాను 432 మంది విద్యార్థులు, 8వ తరగతికి 405 మంది విద్యార్థులకు గాను 323 మంది విద్యార్థులు, 9వ తరగతికి 185 మంది విద్యార్థులకు గాను 152 మంది విద్యార్థులు మరియు పదవ తరగతికి 54 మంది విద్యార్థులకు గాను 42 మంది విద్యార్థులు చొప్పున మొత్తం6 నుండి 10వ) 2513 మంది విద్యార్థులకు గాను 2084 (82.92 శాతం) మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు.

## క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ, శారీరక ధృడత్వం కలగడానికి ఎంతో దోహదం చేస్తాయని, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఎస్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బ్యాటింగ్ చేసి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మేరకు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువకులు ఇలాంటి పోటీల ద్వారా రాష్ట్ర స్థాయి హెచ్‌సిఎఐసిఏ జట్లకు సెలక్ట్ అయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావుతో పాటు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరమాండ్ల సత్యనారాయణ, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొంతం రాజం, ప్రముఖ న్యాయవాది రాంబాబు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజోజు సదానంద చారి, రెబ్బటి రాజశేఖర్, కాసా సంజీవ్, కంతి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక తరలించొద్దంటూ రెండవ రోజు దీక్ష




**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి రీచ్ నుండి కాంట్రాక్టర్లు ఇసుకను తరలించవద్దంటూ డిమాండ్ చేస్తూ రీచ్ వద్ద గ్రామస్తులు నిరాహార దీక్ష చేశారు. ఆదివారంతో నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిరాహార దీక్ష లోకూర్చున్న వారు మాట్లాడు తూ ఇసుక తరలింపుతో మానేరు వాగులో భూగర్భ జలాలు అడుగంటిపోయి ఈ వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఏర్పడుతుందని, దీంతో ప్రజలు చా లా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు, వెంటనే ఇసుక తవ్వకాలను నిలిపివేసి కాంట్రాక్ట్ రద్దు చేసే అంతవరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయి అన్నారు. ఈ నిరాహార దీక్ష శిబిరాన్ని మానేరు పరిరక్షణ కమిటీ లీగల్ అడ్వైజర్ కోడెం అజయ్, మానేరు పరిరక్షణ కమిటీ జాయింట్ సెక్రెటరీ చిటికేష్ సతీష్‌లు సందర్శించి సంఘీభావం తెలిపారు, ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనాయక్ దామోదర్ రావు. ఎంపిటిసి శీలం శంకర్, కోడి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


# ప్రజాసేవకు కేరాఫ్ కాకా ఫ్యామిలీ

నాడు తాత.. తండ్రి.. నేడు తనయుడు

పెద్దపల్లి పార్లమెంట్ గడ్డం ఫ్యామిలీకి అడ్డా

కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా కాకా వారసుడు వంశీకృష్ణ గెలుపు ఖాయమంటున్న విశ్లేషకులు





**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** దాదాపు మూడు దశాబ్దాలుగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో బడుగు బలహీనవర్గాల ప్రజలకు సేవలు అందించడంలో కాకా ఫ్యామిలీ కేరాఫ్‌గా నిలుస్తోంది. దళిత సామాజిక వర్గాన్ని చెందిన వారైన కాకా కుటుంబం నాటి నుంచి నేటి వరకు అదే ఆశయంతో ముందుకు సాగుతున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఆనాడు గడ్డం వెంకటస్వామి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అటు తర్వాత వరుసగా ఐదు సార్లు ఎంపిగా విజయం సాధించడంతో పాటు కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు ఈ ప్రాంతంలో ఎంపిగా, కేంద్ర మంత్రిగా అనేక సేవలు అందించిన గడ్డం వెంకటస్వామి వారసుడిగా గడ్డం వివేక్‌ను ప్రకటించిన నేపథ్యంలో పార్టీ అధిష్టానం మళ్లీ ఆ ఫ్యామిలీకే ఎంపి టికెట్ కేటాయించింది. ఈ క్రమంలో వివేక్ ఎంపిగా రెండుసార్లు విజయం సాధించారు. కాకా తరహాలోనే వివేక్ సైతం ప్రజా సేవకు అంకితమయ్యారు. అటు తర్వాత జరిగిన పరిమాణాలతో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత గడ్డం వివేక్ పార్టీ మారినా తిరిగి ఇటీవలి కాలంలో సొంత గూటికి చేరి చెన్నూర్ ఎంఎల్ఏగా విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ కాకా కుటుంబానికి ఉన్న ప్రాధాన్యత, ఆ ఫ్యామిలీ చేసిన ప్రజా సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా కాకా వారసుడు గడ్డం వంశీకృష్ణకు కేటాయించింది. అయితే గడ్డం వంశీ చిన్నవయస్సులో ఉన్నా అనేక సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉన్నారు. తాత ఆశయాలు అందిపుచ్చుకున్న వంశీ రాజకీయంగా, సేవా పరంగా దూసుకెళ్తాడనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండటం తో పాటు కాకా సెగ్మెంట్‌గా పేరు తెచ్చుకుంది. గడ్డం వెంకటస్వామి పేరు చెప్పితేనే పెద్దపల్లి పార్లమెంట్ గుర్తు చేసుకున్న రోజులు ఉండేవి. అయితే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండు సార్లు ఎంపి స్థానాన్ని బిఆర్ఎస్ కైవలం చేసుకున్నప్పటికి తాజా జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పాగా వేయకతప్పదని విశ్లేషకులు బావిస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్‌లో త్రిముఖ పోటీ ఉన్నా గడ్డం వంశీకృష్ణకే గెలుపు అవకాశాలు కన్పిస్తున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాకా కుటుంబంపై ప్రజల్లో ఉన్న విశ్వాసం, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆశీర్వాదంతో పాటు ఆ కుటుంబం చేసిన ప్రజా సేవ గడ్డం వంశీకృష్ణ విజయానికి నాంది పలుకుతాయని విశ్లేషకులు బావిస్తున్నారు. ఏదిఏమైనా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో జరిగే ఎన్నికల్లో త్రిముఖ పోరు ఉన్నా ప్రజల మొగ్గు మా త్రం గడ్డం వంశీకే ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

## కాంగ్రెస్ ఎంపిలను గెలిపించుకోవాలి

*తిమ్మాపూర్ సహకార సంఘం చైర్మన్ బాస శ్రావణ్ కుమార్*



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపిలను గెలిపించుకోవాలని, బడుగు బలహీన వర్గాలకు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ సహకార సంఘం చైర్మన్ బాస శ్రావణ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలో కాంగ్రెస్ ఎంపిలు గెలిచి అధికారం చేజిక్కించుకుంటారని అన్నారు. పేదల పార్టీగా అణగారిన బహుజన వర్గాలకు అండగా నిలిచే పార్టీగా కాంగ్రెస్‌కు ఇప్పుడు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఆదరణ పెరిగిందన్నారు. మోడీ దేశానికి ప్రమాదమని, నిరుద్యోగులు మోడీ ప్రభుత్వంపైన రగిలిపోతున్నారని వివరించారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌వైపు మొగ్గ చూపుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో ఉనికి కోల్పోయిందన్నారు. వంద రోజుల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు పట్ల ప్రజలు ఆకర్షితులైనారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ని ప్రధాన మంత్రి చేయడం కోసం నిజామాబాద్ ఎంపి అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డిని గెలిపించుకుంటామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగారావుల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామని అన్నారు. కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తే గుర్తింపుతో పాటు వారికి తగ్గ పదవులు వస్తాయని శ్రావణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిలివేరి దేవయ్య, చిట్యాల భూమారెడ్డి, జోగిరాం భూమేష్, బోడ రాజు, కమ్మరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫైనాన్స్, వడ్డీ వ్యాపారస్థులపై పోలీసుల తనిఖీ

అమాయక ప్రజలే లక్ష్యంగా దందా!




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ప్రజల అవసరాలను కొంతమంది ఆసరాగా చేసుకుని అధికమిత్తిని వసూళు చేస్తున్న వైనం రాజన్నసిరిసిల్లా పోలీసు బాస్ దృష్టికి వచ్చింది. శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో పోలీసులు అక్రమవడ్డీ వ్యాపారస్థుల వద్ద నుండి ప్రామీసరి నోట్లు స్వాధీనం చేసుకున్నారు. అమయకులను మోసం చేస్తూ తక్కువ వడ్డీకి ఇస్తున్నట్లు రాసుకుని అధికవడ్డీ వసూలు చేయడంపై పోలీసులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు టీమ్‌లు తనిఖీ నిర్వహిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. అక్రమంగా అధికవడ్డీ వసూళు చేయడమే దీనికి గల కారణమని ప్రజలు భావిస్తున్నారు. కొంత మంది ఎల్లారెడ్డిపేటలో కూడా వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం ఉంది. అక్రమ వడ్డీవ్యాపారం దందాను కొనసాగిస్తే నేరుగా పోలీసులకు లేదా జిల్లా ఎస్‌పికి సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. లైసెన్సు లేకుండా చాలమంది వడ్డీవ్యాపారం కొనసాగిస్తున్న వారిని విచారిస్తే తీగ లాగితే డొంకంతా కదులుతుందని పలువురు గుసగుసలాడుతున్నారు.పెద్ద ఎత్తున వడ్డీ వ్యాపారం లావాదేవిలు కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమార్కులకే వడ్డీలు ఇవ్వడం సర్వత్రా ఉత్కంటగా ప్రజలు చూస్తున్నారు. ఏదేమైనా అధికవడ్డీలు, ఫైనాన్స్ వ్యాపారం నడిపితే సమాచారం గోప్యంగా ఉంచుతామని పోలీసులు పేర్కొంటున్నారు. భాదితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పని చేస్తామని పోలీసులు అంటున్నారు. ఆపదకు సాపతికి ఇస్తున్నామని అక్రమార్కులకే నమ్మిఇవ్వడం కూడా విడ్డూరంగా ఉందని మరికొంత మంది అంటున్నారు. కాయ కష్టం చేసుకునే వారికి ఇవ్వకుండా తీపిమాటలకు నమ్మిఇవ్వడం కూడా మంచిదే అయిందని అనడం కొసమెరుపు.చట్టరిత్యా ఎవ్వరూ కూడా భాధితులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదంటున్నారు.

## రాజకీయ భిక్షపెట్టిన కాంగ్రెస్‌ను బదనాం చేస్తుండు

జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్‌పై కాంగ్రెస్ నాయకుల విమర్శలు



**ప్రజాపక్షం/మంథని:** రాజకీయ బిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీ ని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ బదనాం చేస్తున్నాడ ని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. ఆదివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, రైతు నాయకుడు శ్రీరాంభట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆనాడు కాంగ్రెస్ పార్టీ నుంచే పుట్ట మధూకర్ ఎంపిపి, జెడ్‌పిటిసిగా పదవులు పొందారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ లేకపోతే పుట్ట మధు అనే వ్యక్తి ఎవరికి తెలిసే వాడు కాదన్నారు. తనకు తాను ఏదో గొప్ప నాయకుడిగా ఊహించుకోవడం తగదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దోపిడి, హత్యా రాజకీయాలు చేసి ఈనాడు అధికారం కోల్పోయిన తర్వాత కాంగ్రెస్‌పై తన అక్కసు వెల్లబోసుకుంటున్నాడని అన్నారు. రైతు దీక్ష పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, తమ నాయకుడు శ్రీధర్‌బాబును విమర్శించడం ఎంతవరకు సమంజసమన్నారు. మంథని ప్రాంతంలోని రైతులకు సాగు నీరు ఎలా అందించాలో తమ నాయకుడికి అవగాహన ఉందని, తమ నాయకుడి ఆదేశాల మేరకు రైతులకు సాగునీరు అందించే ప్రక్రియలో ఉన్నామన్నారు. ప్రస్తుతం పంటలు ఎండిపోవడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపించారు. గత ఏడాది వరదలు వచ్చి పంట పొలాలు మునిగిపోతే ఎందుకు స్పందించలేదని, రైతులకు నష్టపరిహారం ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భూములు తీసుకుని ఇతర ప్రాంతాలకు నీళ్లు తరలిస్తే అడ్డుకోలేదని, ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలోని ఒక్క ఎకరానికి సాగు నీరు అందించలేని వాళ్లు ఈనాడు రైతుల గురించి మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోలు శివ, బీసీసెల్ మండల అధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికారి కిషన్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు పర్శవేన మోహన్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, ఐఎన్‌టీయూసీ నాయకుడు పేరవేన లింగయ్య, నాయకులు ఎరుకల రమేష్, అక్కపాక సదయ్య, సాధుల శ్రీకాంత్, గొల్లపల్లి శ్రీనివాస్, రాజేశ్వర్, జగదీష్, రమేష్, శేఖర్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు,

## మంచిర్యాల మున్సిపాలిటీలో అవినీతి దందా

పురపాలక అభివృద్ధికి కుచ్చుటోపీ

రెసిడెన్షియల్ అనుమతులతో అపార్ట్‌మెంట్ల నిర్మాణం

అధికారులను మచ్చిక చేసుకుంటే చాలు సెట్ బ్యాక్‌లతో పనే లేదట..?





**ప్రజాపక్షం/ మంచిర్యాల క్రైం :** మంచిర్యాల బల్దియాలో కొత్త తరహా అవినీతి దందాకు అధికారులు తెరలేపారు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుంటూ ఏకంగా భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణాలు చెప్పటమే ఈ దందా సారాంశం. దీంతోపాటు సదర్ భవనాలకు సెట్ బ్యాక్ లేకున్నా మున్సిపాలిటీ అధికారులు చూసి చూడనట్లు మౌనం ప్రదర్శిస్తూ ఉండడం వెనక మరేదో కారణం ఉందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ దందా బిల్డర్లకు, మున్సిపల్ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఇలాంటి చర్యలతో మున్సిపాలిటీ అభివృద్ధికి కుచ్చుటోపీ పెట్టడమే కాకుండా, పట్టణ అభివృద్ధి ముందుకు సాగేందుకు అవసరమైన నిధులకు గండిపడుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సరైన అనుమతులు లేకుండా అక్రమణ నిర్మాణాలు నిత్యం వందల సంఖ్యలో చేపడుతున్నారు. రెసిడెన్షియల్ పేరిట అనుమతులు పొంది అపార్టమెంట్‌లను నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్న అధికారులు మాత్రం తమకేమి పట్టవన్నట్లు వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ అనుమతులు కూ డా లేకుండానే పట్టణంలో అనేక బహుల అంతస్థులు, భారీ కట్టడాలు రోజు రోజు వెలుస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు మిన్నకుండి పోతున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కనీసం ఆకట్టడాలకు వెళ్లి కన్నెత్తి కూడా చూడడం లేదనే వాదనలు సైతం వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో చేపడుతున్న భారీ భవనాలకు అనుమతులే కాకుండా నియమ నిబంధనలను తుంగలో తొక్కుతున్న బల్దియ అధికారులు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరించడం గమనార్హం. ప్రతి భవనానికి సెట్ బ్యాక్ లేకపోవడం, బఫర్ జోన్ లను ప్రాంతాలను గమనించక పోవడం అధికారుల లోపాయికారి నిర్లక్ష్య వైఖరికి దర్పణం పడుతుంది. ప్రణాళిక విభాగం నియమాల ప్రకారం కచ్చితంగా ప్రతిభవనానికి సెట్ బ్యాక్ అనేది ఖచ్చితంగా ఉండి తీరాలి. అలా ఉంటేనే నిర్మాణాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉన్న అధికారులకు చేతివాటలో ఎం తో కొంత పుచ్చుకొని మౌనంగా ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

**అధికారులను సెట్ చేస్తే చాలు సెట్ బ్యాక్ అవసరం లేదు**

ఒక విధంగా అధికారులకు సెట్ చేస్తే చాలు సెట్ బ్యాక్ అవసరం లేదని బల్దియాలోని ప్రజలు బాహాటంగా వెల్లడిస్తున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ సిటీ, ఇక్బాల్ అహ్మద్ నగర్, పట్టణంలోని చుట్టూ ప్రక్కల ప్రాంతాలు ము ఖ్యంగా బెల్లంపల్లి చౌరస్తాలోని అపార్ట్‌మెంట్‌లు, అక్రమంగా నిర్మిస్తున్న భారీ అపార్ట్మెంట్ల విషయంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. అదే విధంగా అతనికి మరో బ్యాంక్ మేనేజర్ తోడయ్యాడని చర్చ జోరుగా సాగుతుంది. వీరిద్దరు మంచిర్యాల బల్దియాలో చక్రం తిప్పుతూ సంబంధిత అధికారులను తప్పుదోవ పట్టిస్తూ మచ్చిక చేసుకుంటున్నారని, దీంతో అధికారులతో పాటు సదరు వ్యక్తులు కొంత నగదు పొందుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి అనుమతులు లేని భవనాలను, అక్ర మ కట్టడాలను అడ్డుకొని మంచిర్యాల పట్టణ అభివృద్ధి పథంలో దూసుకు వెళ్ళేల చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## బిర్యానీలో పురుగు




**ప్రజాపక్షం/నర్సాపూర్(జి) :** నిర్మల జిల్లా నర్సాపూర్ జి మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న శ్రీ రాజరాజేశ్వర బిర్యానీ పాయింట్ అండ్ అర్డర్ మెస్‌లో బిర్యాని అన్నంలో నల్లి పురుగు వచ్చింది. అ పురుగుల బిర్యానీ అన్నాన్ని తిన్న కస్టమర్ షాక్ తిన్నాడు. కొద్ది సమయం తర్వాత వాంతి చేసుకోని అస్వస్థతకు గురి అయ్యాడు అనంతరం చికిత్స నిమిత్తం నిర్మల్ ఆసుపత్రికి వెళ్ళాడు. ఇప్పుడు అతని ఆరోగ్యం నిలకడగానే ఉంది.

**హోటల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి**

ఎటువంటి అనుమతులు లేకుంగా నాణ్యత లేని ఆహారాన్ని వండి పెడుతున్న శ్రీ రాజరాజేశ్వర బిర్యాని పాయింట్ అండ్ ఆర్డర్ మెస్ హోటల్లను నిర్వహిస్తున్న యజమాని రవి పై ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుడు బాదవ్ ఈశ్వర్ కోరారు.

**జనాల ప్రాణాలు గాలిలో కలిసిన అధికారులకు పట్టింపు లేదు**

విచ్చల విడిగా ఎక్కడ పడితే అక్కడ హోటల్లు పుట్టలు పుట్టలుగా ఎటువంటి అనుమతులు లేకుంగా ఏర్పాటు కావడం, పరిశుభ్రతలో పాలు ఉన్న, నాణ్యత ప్రమాణలు కరువైన ఫుడ్ సేఫ్టీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా డబ్బులకు కక్కుర్తిపడి మనుషుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారటానికి ఇదే నిదర్శనం

## ఎండకు ఎడారి... వర్షాలకు గోదారి

ముంపు ప్రాంతంలో వెంచర్ల ఏర్పాటు





**ప్రజాపక్షం/లక్షెట్టిపేట్ :** ఎండకు ఎడారి.. వర్షాలకు గోదారి అన్న తీరు ఉంది మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్ మండలంలోని అంకత్‌పల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్. అంకత్‌పల్లి ప్రధాన రహదారి వెంట ఉన్న వాగును ఆనుకొని ఉన్న ప్రాంతంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఫ్లాట్లుగా మార్చి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వెంచర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతం గత వర్షకాలంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో నిండి పూర్తిగా గోదావరిని తలపించే విధంగా ఉన్న సంగతి అందరికి తెలిసిందే. కాగా వ్యాపారులు రైతుల నుండి తక్కువ ధరకు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఫ్లాట్లుగా మార్చి ప్రజలకు మాయ మాటలు చెప్పి అమ్మకం చేయడానికి యత్నిస్తుండడం గమనార్హం. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ప్రధాన రహదారి వెంట ఉన్న వాగు ప్రాంతంలో ఫ్లాట్లను ఏర్పాటు చేస్తుంటే సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వలన ప్రజలకు భారీ నష్టం చేకూరే అవకాశం ఉంది.

**ముంపు ప్రాంతంలో ఫ్లాట్ల ఏర్పాటు ఎలా..?**

ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో నిండ మునిగే ప్రాంతంలో ఫ్లాట్లను ఏర్పాటు చేయుటకు సంబంధిత శాఖ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారు అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు వెంచర్‌కు అనుమతులు ఉన్నాయా.. లేక రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి ఇష్టానుసారంగా వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారా అనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. ఒకవేళ అనుమతులు ఉంటే ముంపు ప్రాంతంలో ఫ్లాట్ల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారు. లేకుంటే అనుమతులు లేకుండా ముంపు ప్రాంతంలో ఫ్లాట్లు ఏర్పాటు చేసి విక్రయిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే చర్చ కూడ జోరుగా సాగుతుంది.

## ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీకే ఓటేద్దాం

మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్క ఐలయ్య

**ప్రజాపక్షం/జమ్మికుంట :** రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మన ఓటును ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీకే వేద్దామని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్క ఐలయ్య అన్నారు. ఆదివారం జమ్మికుంట, హుజురాబాద్, కేశవపట్నం,మానకొండూర్ పట్టణాల్లో కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకూ విద్వేష రాజకీయాలు పెరిగిపోతున్నాయన్నారు. రాజ్యాంగం, ప్రజల హక్కులపై పాలకులకు కనీస గౌరవం లేని పరిపాలన కేంద్రంలోనే కొనసాగుతోందన్నారు. నిరుద్యోగం, పేదరికం, దేశ ఆర్థిక స్థితిగతులు రోజు రోజుకూ దిగజారిపోతున్నాయన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు లేకుండా చేయడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, హక్కుల గురించి మాట్లాడే వారి గొంతు నొక్కడం చూస్తూనే ఉన్నామన్నారు. అటువంటి రాజకీయ పార్టీలను ప్రజలు ఆదరించకూడదని కోరారు. ఆయనతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.అచ్చుత్ కుమార్, ఎం.కిరణ్, సదానందం, కొత్తూరు కుమార్‌లు పాల్గొన్నారు.



## సిపిఐ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా వెంకటస్వామి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** దేశవ్యాప్తంగా జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మ(రి వెంకటస్వామి ఎన్నికయ్యారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సమక్షంలో ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మ(రి వెంకటస్వామి ఎన్నికవగా కమిటీ సభ్యులుగా సిద్దిపేట, హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కార్యదర్శులు మంద పవన్, కర్రె బిక్షపతి, గుంటి వేణు, వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గడిపె మల్లేష ఆదరి శ్రీనివాస్, కసిరెడ్డి మణికంఠరెడ్డి, భారత జాతీయ మహిళా సమాఖ్య ఐదు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కిన్నెర మల్లవ్వ, గూడ పద్మ, మంచాల రమాదేవి, కె.వి. అనసూయ, కొక్కుల శాంతవ్వ ఎన్నికయ్యారు.

## తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం /నల్లగొండ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తప్పుడు ప్రచారాలతో కూడిన అభ్యర్థుల వ్యక్తి గత ప్రచార పోస్టర్లును విడుదల చేస్తే చర్యలు తప్పవు అని జిల్లా ఎస్పి చందనా దీప్తి హెచ్చరించారు. అభ్యర్థుల తమ ఎన్నికల కరపత్రం లేదా పోస్టర్‌లు అభ్యర్థుల ముఖం పేర్లు, ప్రింటర్, పబ్లిషర్ చిరునామాలు లేనివి ముద్రించడం లేదా ప్రచురించటం వంటివి చేయకూడదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన క్రింద ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేయబడతాయి అని అన్నారు. ఎన్నికలకు నేప థ్యంలో గ్రీవెన్స్ రద్దు పార్లమెంటు ఎన్నికలకు నేపథ్యంలో ఎన్నికల ప్రవ ర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున ప్రతి సోమవారం నిర్వ హించే గ్రీవేన్స్ డే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా జిల్లా ఎస్ పి చంద న దీప్తి తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని, అలాగే పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు అనగా జూన్ వరకు గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరగ దని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా ప్రజలు ప్రతి సోమవారం వినతులను సమర్పించేందుకు జిల్లా కార్యాలయానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** మహిళలు అన్ని రంగాలలో ధైర్యంగా రాణించాలని ఆర్యన్స్ యోగ అండ్ ఫిట్నెస్ సెంటర్ యోగ గురుజీ సంధ్య అన్నారు. ఆదివారం ఫన్ డే కార్యక్రమాన్ని స్థానిక పంచ తత్వ పార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వరకు ఉన్న మహిళలకు నిర్వహించిన ఫన్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ అమ్మ ఆరోగ్యం అంటే ఇంట్లో ఉన్న మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ ఇల్లంతా ఆరోగ్యంగా ఉంటుందని అందుకోసం ప్రతి ఒక్కరూ యోగా అలవర్చుకొని ఆ కుటుంబాన్ని ఆనందంగా ఆరోగ్యంగా గడపాలన్నారు. ఈ సందర్భంగా యోగాలో శిక్ష ణ పొంది బాగా బరువు తగ్గిన వారికి చొక్కారపు మాధవి బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలు చిన్నా పెద్ద తారతమ్యం లేకుం డా జారుడుబండ ,ఉయ్యాల ఊగడం, మరికొన్ని క్రీడలతో ఆనందంగా గడిపారు.

## లోవోల్టేజీ నివారణకు చర్యలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యుత్ లో వోల్టేజీ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ సంగెం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నివారణ పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. పట్టణ సబ్‌స్టేషన్‌లో అదనంగా నూతన ఐదు ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్లను మూడు రోజుల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవధంగా త్రిపురారం సబ్‌స్టేషన్ పక్కన నూతన సబ్‌స్టేషన్ వారంలో ఏర్పాటు చేసి వినియోగదారులకు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. వీటితోపాటు డివిజన్ పరిధిలో సబ్‌స్టేషన్లలో మండలాల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో టంగ్ టెస్టర్‌తోటి ఎప్పటికప్పుడు కరెంట్ లోడ్ చెక్ చేయించి ఎక్కడైతే వోల్టేజీ సమస్య ఉందో అక్కడ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉన్నతాధికారులు డైరెక్టర్ ఆపరేషన్ నరసింహులు, సీజీఎం భిక్షపతి అధికారులకు మిర్యాలగూడ డివిజన్ విద్యుత్‌లో లో వోల్టేజీ సమస్యలు మిగతా సమస్యలు వారికి తెలియచేయగా వెంటనే స్పందించి డివిజన్‌కు వచ్చారు. వెంటనే ఏడీఈలు, టీఆర్ఈ, ఎమ్మార్టీ, ఏఈలు కలిసి డైరెక్టర్, సీజీఎం వెంట డివిజన్‌లోని సబ్‌స్టేషన్ల ఆపరేషన్ డైరెక్టర్ నరసింహులు, సీజీఎం భిక్షపతి, అధికారులు చంద్రమోహన్, జ్యోతికుమార్, రవీందర్‌రెడ్డి, కోడిరెక్క రవికుమార్, దాసయ్య, నిఖిత, ఉదయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, మణిదీప్, శ్రీధఖ్, నరసింహాచారి, మారం శ్రీనివాస్, షరీఫ్, సోమాచారి, శ్రీరాములు, లచ్చయ్య, అశోక్, ఉప్పల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దుమ్ముదూళితో అనారోగ్య పాలైతున్నాం

### గ్రానైట్ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి కాశ కాలనీ మట్టి రోడ్లపై టిప్పర్ లారీలలో గ్రానైట్ రవాణా తమకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు ఆదివారం అడ్డుకున్నారు. పక్కనే ఉన్నసైదాపూర్ మండలం అమ్మనగుర్తి గ్రామ శివారులోని గ్రానైట్ క్వారీ నుండి ప్రతిరోజు పదుల సంఖ్యలో లారీలు తమ కాలనీ నుండి భారీ శబ్దాలులతో వెళ్తు రోడ్లు పూర్తిగా ధ్వంసం చేసాయని వాపోయారు. లారీలలో గ్రానైట్ రవాణాతో ఇండ్లు మొత్తం దుమ్ము ధూళితో నిండిపోయి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, లారీలను అడ్డుకుని రోడ్డుపై నిరసన చేపట్టారు. లారీల అడ్డగింత సమాచారం తెలుసుకున్న వంగర ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కాలనీకి చేరుకుని వారితో మాట్లాడారు. చట్ట ప్రకారం పన్నులు చెల్లించి గ్రానైట్ రవాణా చేస్తున్నారని, కాలనీవాసులకు ఎద్దైనా సమస్య ఉంటే జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేయాలని సూచించారు. లారీలను అడ్డుకుంటే అందరిపై కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు. నిరసనకారులు, పోలీసులకు మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రానైట్ లారీలతో వంగర పివి నగర్, కాశకాలనీ రోడ్లు పూర్తిగా ధ్వంసమై ఉన్నాయి. మట్టి రోడ్డు కావడంతో దుమ్ము ధూళితో స్థానికుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## బిఆర్‌ఎస్ పాలన అంతా... మాయమాటల మయం

### కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

### సిపిఐలోకి భారీ చేరికలు



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** కమ్యూనిస్టు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా కాపాడుకుంటామని, కమ్యూనిస్టు పార్టీ శాశ్వతంగా ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఆదివారం సుజాతనగర్ మండలంలోని కోమటిపల్లి, సీతంపేట బంజర, జండాలసెంటర్ నుండి సిపిఐలోకి భారీ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి ఎర్ర కండవాలు కప్పి పార్టీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానించారు. ముందుగా సాంబశివరావు రాకతో గ్రామాలలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ పాలనలో ప్రజలకు మాయమాటలు చెప్పడం తప్ప పని చేసింది ఏమీ లేదన్నారు. రాబోయే రోజుల్లో బిఆర్‌ఎస్ కనుమరుగవడం ఖాయం అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్‌ఎస్, బిజెపి పార్టీలను ఓడించాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు ఏ ప్రభుత్వం చేసిన సహించేది లేదని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు ప్రజలకు అందే విధంగా చూడాలని, రాష్ట్రంలో కొత్తగూడెం నియోజకవర్గం ప్రత్యేకం నియోజకవర్గ అభివృద్ధికి శతవిధాల కృషి చేస్తున్న ప్రజలందరి సహకారం వారి ఆశీస్సులు ఎప్పుడూ నాకు కావాలి అన్నారు. సిపిఐ లో చేరిన వారిలో సీతంపేట సర్పంచ్ లావుడియా మంగమ్మ, గోపి, ప్రసాద్, చౌహాన్, రాజీవ్, హీరలాల్, లక్ష్మ , మంగ్యా, ఉపేందర్, జెండాల సెంటర్ నుండి బొడ్డు కేశవరావు, నవీన్, గడ్డం రాములు, మల్లాచారి, నరసింహ చారి, దండు సురేష్, గడ్డం రాములు, కోమటపల్లి నుండి ఎంపీటీసీ, మూడు గణేష్, రామచంద్ర గణేష్, రామచంద్ర, ప్రశాంత్, రాంబాబు, రమేష్, రాజా, భూక్య రాజేష్, హరి, మోహన్, నాగేష్, నరేష్, శంకర్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, సంయుక్త కార్యదర్శి కుమారి హనుమంత రావు, కొత్తగూడెం వార్డు కౌన్సిలర్లు జమలయ్య, భూక్య శ్రీనివాస్, ఎంపిటిసి భూక్య పద్మావతి, జక్కుల రాములు, భాగం శేషభూషణం, తాళ్ల వెంకటేశ్వర్లు, ముక్కెర మురళి, సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల బాధ్యులు, సిపిఐ సానుభూతిపరులు పాల్గొన్నారు.



## గుడిసెవాసులకు ప్రభుత్వ భూమి కేటాయించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్‌లోని పైడిపల్లిలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించిన ప్రాంతాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడిపల్లి శివారు ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిలో గత రెండేళ్ల క్రితం వందలాది కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, శనివారం తెల్లవారుజామున ప్రభుత్వాధికారులు, పోలీసులు, ఇతర సిబ్బంది జేసీబీలు, డోజర్లతో అర్ధరాత్రి నిద్రలో ఉన్న పేద ప్రజల గుడిసెలను నేలమట్టం చేయడం దుర్మార్గ చర్య అన్నారు. తొలగించిన ప్రభుత్వ భూమిలోనే గుడిసెలు ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. మహిళలు, చిన్న పిల్లలు, ముసలివారు నిద్రలో ఉన్న సమయంలో అధికారులు, పోలీసులు దురుసుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. కూలీ నాలి చేసుకుంటూ గుడిసెలు వేసుకుంటే దాడిచేసి గుడిసెలను నేలమట్టం చేయడం వల్ల పేదలు ఆర్థికగా నష్టపోయారని ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించాలని, ఇల్లు కట్టుకోడానికి రూ. 5 లక్షలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా, మండల కార్యదర్శి బుస్సారవిందర్, నాయకులు జన్ను రవి తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి ప్రయత్నించని కేంద్రం

### సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యుడు బాల్‌నర్సింహ్మ




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రప్రభుత్వాన్ని గద్దెదించాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సింగిల్‌విండో హాల్లో జరిగిన సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో బిజెపిప్రజావ్యతిరేక విధానాలపై జిల్లా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గత పది సంవత్సరాలనుంచి అధికారంలో ఉన్న బిజెపి ఏనాడుకూడా పేదప్రజల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోకుండా ఆర్‌ఎస్‌ఎస్ మనువాద ఎజెండాను అమలుచేస్తూ దేశంలో కులమత ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నదన్నారు. మణిపూర్ మారణ హోమంపై ఇప్పటివరకు స్పందించని ప్రధాన మంత్రి నరేంద్రమోడి ప్రభుత్వసంస్థలను నడపడానికి చేతకాక ప్రైవేట్ వ్యక్తులైనటువంటి అంబాని, ఆదానిలకు ఒక్కొక్కటిగా అప్పచెబుతున్నారన్నారు. స్వాతంత్ర్యకాలంనుండి నేటివరకు నిర్మించుకున్నటువంటి ప్రభుత్వసంస్థలను నిర్వీర్యంచేస్తూ కార్పొరేట్‌పాలనకు దాసోహమైన నరేంద్రమోడి ఇప్పటికే దేశాన్ని అన్నివిధాలుగా నాశనంచేశారన్నారు. ఇప్పుడు మళ్లీ మూడోసారి అధికారంలోకి నేనే వస్తానని ప్రగల్భాలు పలుకుతూ ఆయనకు వ్యతిరేకంగా ఉన్నటువంటి పార్టీలను ఇడి, సిబిఐ ఇతర కేంద్రప్రభుత్వ సంస్థలను ఉపయోగించుకొని ప్రతిపక్షపార్టీల నాయకులపై దాడులుచేస్తూ ఆదాడులకు గురైన వ్యక్తులు బిజెపిలోచేరితే వారిపైదాడులు ఆపేసి చేరనివ్యక్తులను జైలుకు పంపుతున్నటువంటి వాస్తవాలను మనంచూస్తూనే ఉన్నామన్నారు. కిల్లెగోపాల్ మాట్లాడుతూ ఎవరైన ఎన్నికలటైమ్‌లోచేసిన అభివృద్ధి చెప్పుకొని ఓట్లు అడుగుతారు కాని నరేంద్రమోడీ మాత్రం వ్యక్తిగత విషయాలైనటువంటి కులం, మతాన్ని అడ్డుపెట్టుకొని దేవుళ్ల పేరు చెబుతూ ఓట్లు అడగటం నేడు మనంచూస్తూనే ఉన్నామన్నారు. 400సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బహిరంగంగానే బిజెపినేతలు చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐరాష్ట్ర సమితిసభ్యులు హెచ్. ఆనంద్‌జి, కేశవులుగౌడ్, సిపిఎంజిల్లా కార్యదర్శి వర్ధంపర్వతాలు, ఆర్.శ్రీను, ఆంజనేయులు, ఈర్ల చంద్రమౌళి, కృష్ణాజి, లక్ష్మి పతి, శివశంకర్, శ్రీను, రవీందర్, రామ య్య, ప్రేమ్‌కుమార్, కాశన్న, సిపిఐ, సిపిఎంజిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి

### ఎంఎల్‌ఎ కుంభం అనిల్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్‌ఎస్ పార్టీకి రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని భువనగిరి ఎంఎల్‌ఎ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డిని తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో పిఆర్జి ఫంక్షన్ హాల్‌లో గోలి పింగళి రెడ్డి నాయకత్వంలో బిఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఫోన్ ట్యాపింగులు, భూ కుంభకోణాలతో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి అభ్యర్థి చామల కుమార్ కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన సుమారు 200 మంది కార్యకర్తలు వారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన ప్రకటించారు. బిఆర్‌ఎస్‌కి రాజీనామా చేరిన వారిలో ముస్లిం మైనార్టీ సంఘం, ముదిరాజ్ సంఘం, మున్నూరు కాపు సంఘం, యాదవ సంఘం, ఇందిరమ్మ కాలనీకి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి గోలి ప్రణీత పింగళి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొటోల్ల శ్యామ్ గౌడ్, ఎంపీటీసీలు గోలి నరేందర్ రెడ్డి, దండం భార్గవ్ పాల్గొన్నారు.

## యజమానులు, ఆసాములు కార్మికులను ఉసిగొలిపారు



**ప్రజాపక్షం/సిరిసిల్ల :** నేత కార్మికుల సమస్యను జటిలం చేసేందుకు కొంత మంది యజమానులు, ఆసాములతో పాటు కార్మికులను ఉసిగొలిపి సమ్మెకు దారి తీశారని టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం విమర్శించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అంతా జటిలమైన సమస్య కాదని ఈ సమస్యను కొంతమంది జటిలం చేస్తున్నారని మండిపడ్డారు. యజమానులను పరిశ్రమలను ప్రారంభించాలని ఎన్నోసార్లు విన్నవించామన్నారు. కార్మికులకు పని కలిపించండి ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు ఖచ్చితంగా ఇప్పిస్తామని హామీ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కేసీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నడని ఏ ఒక్కనాడైనా ధర్నాలో పాల్గొన్నవా అని ప్రశ్నించారు. పరిశ్రమకు ఇవ్వవల్సిన దాదాపు రూ.300 కోట్ల రూపాయలు ఎందుకు పెండింగ్ పెట్టారో కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. బతుకమ్మ చీరల కోసం కొంతమంది ఏజెంట్లను పెట్టి కోట్ల రూపాయలు దండుకున్నారని ఎద్దేవా చేశారు. బతుకమ్మ చీరల స్కీం కార్మికుల కోసం నిరుపేదల కోసం కాదని కేసీఆర్ జేబులు నింపు కోవాడానికే ఈ స్కీమ్ తీసుకొచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, రాష్ట్ర నాయకులు సంగీతం శ్రీనివాస్, వెంగళ అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నమోదు పెంచడానికి కృషి

### శాసనమండలి సభ్యుడు అల్లుగబెల్లి నర్సిరెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకు ప్రభుత్వం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని శాసనమండలి సభ్యులు అల్లుగబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఆదివారం టిఎస్ యూటిఎఫ్ సూర్యాపేట జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కన్నెబోయిన సోమయ్య అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచుటకు తీసుకోవాల్సిన చర్యలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్ షాపుకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం విద్యార్థుల నమోదు సంఖ్య తగ్గిపోతున్నదని రాబోయే కొన్ని సంవత్సరాలలో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు అయ్యే విద్యార్థుల సంఖ్య జీవో స్థాయికి వచ్చే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకు ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 2023 2024 డైస్ గణాంకాల ప్రకారం 15 తరగతుల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో 23వేలు ఉండగా, కాగా ప్రైవేట్ పాఠశాలల్లో 36వేల మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ ఆందోళనకరంగా పడిపోతున్నదని, ప్రస్తుతం ఉన్న వసతులు, టీచర్లతో ఎన్‌రోల్‌మెంట్ పెంచుకునే అవకాశాలను ఆలోచించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి కనీస సంఖ్య ఉన్నప్పుడే విద్యార్థుల్లో అభ్యసన ప్రక్రియ మెరుగ్గా ఉంటుందని, ప్రతి తరగతికి కనీస సంఖ్య 15 మంది ఉండాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలను అవసరము ఉన్నచోట ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని అవసరం లేని వాటిని ప్రాథమిక పాఠశాలలను డిగ్రేడ్ చేయాలని సూచించారు. 50లోపు విద్యార్థులు ఉన్నత పాఠశాలల ఆవాస గ్రామంలో 610 చదవే విద్యార్థులు సంఖ్య 75కి లోపు ఉండి 3 కిలోమీటర్ల దూరంలో మరొక ఉన్నత పాఠశాల ఉన్నట్లయితే ఆ పాఠశాలలను కొనసాగించాలా లేదా ఆలోచించాలని తెలియజేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ పెడతామని తెలియజేసిందని కానీ కొత్త పాఠశాలలు అవసరం లేదని ఉన్నటువంటి పాఠశాలలను హేతుబద్దీకరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, పౌరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఏ మంగ, పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు ఆర్.ధనమూర్తి, టిఎస్ యూటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరెడ్డి, కె. అరుణ,భారతి, జిల్లా కార్యదర్శులు ఆర్. దామోదర్,పాపిరెడ్డి, ఎన్. నాగేశ్వరరావు, రమేష్, సాంబయ్య, లాలు, శ్రీను, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రిన్సిపల్ ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

## ఐఎంఎ సేవలు ప్రశంసనీయం

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

### పారిశుద్ధ్య సిబ్బందికి ఉచిత గుండె వ్యాధుల శిబిరం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) వారి సేవలు ప్రశంసనీయం అని బల్దియా కమీషనర్ అశ్విని తానాజి వాకడే అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ ఐ ఎం ఎ హాల్ లో బల్దియా పారిశుధ్య సిబ్బంది కోసం ఐఎంఎ వరంగల్ శాఖ వారి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వ్యాధుల శిబిరాన్ని కమీషనర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నా ఆరోగ్యం నా హక్కు అనే నినాదం తో ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్యదినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని, నగరాన్ని ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్న పారిశుధ్య సిబ్బంది ఆరోగ్య రక్షణ కోసం స్పందించి సామాజిక దృక్పథంతో హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని, వేసవి కాలం దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తీసుకోను జాగ్రత్తల గురించి అవగాహన కలిగించడంతో పాటు సిఎంహెచ్ఓ సహకారంతో ఐఎంఎ వారు ఓఆర్ఎస్ ప్యాకెట్ లు అందుబాటు లో ఉంచేలా చూడాలని, 14 మంది నిపుణులైన హృద్యోగ డాక్టర్ లతో సిబ్బంది కి స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగించాలని కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి ఉచితంగా బిపి షుగర్ పరీక్షలతో పాటు అవసరం మేరకు 2డి ఎకో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా.కాళీ ప్రసాద్ రావు రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా. రాజేష్, ఐఎంఎ వరంగల్ అధ్యక్షులు డా. మహమ్మద్ అన్వర్, సెక్రెటరీ డా. బింగి శ్రీనివాస్, ట్రెజరర్ డా. దిడ్డి శ్రావణ్ కుమార్, డాక్టర్ అజిత్ ముహమ్మద్, డా. నాగార్జున రెడ్డి, కార్డియాక్ డాక్టర్లు రామకృష్ణ, నరేష్ కుమార్, మమత రెడ్డి, రామ్ రెడ్డి, షఫీ, రామ కృష్ణారెడ్డి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణ, భద్రత పోలీసుల ప్రథమ కర్తవ్యం

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** ప్రజల రక్షణ, భద్రత పోలీసుల ప్రథమ కర్తవ్యం అని శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్ అన్నారు. నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజలకు పోలీసులు ఎల్లవేళలో అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ఎస్ఐ ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది సహాయంతో రాబోవు పార్లమెంటు ఎలక్షన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి కాలనీలోని ఇండ్లలో సోదాలు చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు ఇల్లు అద్దె కొరకు మీ వద్దకు వస్తే వారి పూర్తి వివరాలను అడిగి ఆధార్ కార్డు తీసుకోవాలని, ఏదైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహన పత్రాలను కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు, మహిళలు ఆపద సమయంలో స్థానిక పోలీసులకు లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. సిఆర్‌పిఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్మార్ట్ టివి బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

సంతోష్ ముండా కుటుంబ సభ్యుల పేరుతో రిఫ్రిజిరేటర్, టివిలను సోరెన్ కొనుగోలు చేశారు. సంతోష్ గత 14 సంవత్సరాలుగా సదరు ఆస్తికి సంరక్షకునిగాఉన్నారు. కాగా, సదరు భూమితో తనకు ఎలాంటి సంబంధం లేదని సోరెన్ చేస్తున్న వాదనను ఇడి తోసిపుచ్చింది. కబ్జాకు గురైనట్టు చెప్తున్న భూమి తనదంటూ రాజ్‌కుమార్ పహన్ అనే వ్యక్తి ఇచ్చిన ప్రకటనను కూడా ఇడి పరిగణలోకి తీసుకోలేదు. ఇడి ప్రకారం ఆ భూమి 'భూస్వారి' ఆస్తి. అంటేసాధారణ పరిస్థితుల్లో ఎవరికీ బదిలీ చేయడం లేదా విక్రయించడం సాధ్యపడదు. అంతేకాదు, ఈ భూమిని కేవలం 'ముండాలు', 'పహన్లు'కు మాత్రమే కేటాయిస్తారు. వారు మాత్రమే సదరు ఆస్తులకు యజమానులు. ఇడి చేస్తున్న ఇతరత్రా ఆరోపణలు, వివరణలు ఎలావున్నా, ప్రధాన సాక్ష్యం కింద రిఫ్రిజిరేటర్, టివి బిల్లులను చూపడం విడ్డూరంగా ఉంది. సోరెన్‌పై చేసిన అవినీతి, భూకబ్జా, మనీలాండరింగ్ ఆరోపణలను రుజువు చేసే సాక్ష్యాధారాలు ఏవీ ఇడి వద్ద లేకపోవచ్చన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 Editor : Makkena Subbarao, Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com